Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

# జమీన్‌రైతు

సంపుటి: 81 • సంచిక: 7 • 12-2-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్
పొగతోట, నెల్లూరు, ఫోన్: 2303300

# గవర్నర్‌కు తొందరగా వుంది!

కొత్త గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్ మహా తొందరలో వున్నారు. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టాలని ఉర ఉరలాడి పోతున్నారు. అందరు గవర్నర్ల మాదిరి ప్రభుత్వం పంపే ఫైళ్ల మీద రబ్బర్ స్టాంప్ వేస్తూ కాలక్షేపం చేయడం ఆయన తరం కావడం లేదు. మంచి ఆరోగ్యం, పనిచేసే ఓపిక, సుదీర్ఘ కాలం క్షణం తీరికలేని ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను నిర్వహించిన అనుభవం తదితరాల వల్ల గోళ్లుగిల్లుకొనే గవర్నర్ల లాగా రాజ్‌భవన్‌లో పడి వుండడం ఆయనకు నచ్చడం లేదు.

వైఎస్, చంద్రబాబు వంటి నేతలు ముఖ్యమంత్రులుగా వుంటే ఏ గవర్నర్ కూడా తోక జాడించలేదు. కానీ ఇప్పుడున్నది రోశయ్య. తాను నిమిత్తమాత్రుడనని తనకు తానే పదే పదే చెప్పుకొంటున్నాడాయన. తనది బలహీన ప్రభుత్వమనే సంకేతాలు తానే ఇస్తున్నాడు. అది గవర్నర్‌కు బాగా కలిసి వస్తున్నది. తాత్కాలిక గవర్నర్‌గా వచ్చిన రోజే హోంమంత్రి, పోలీసు అధికారులను రాజ్‌భవన్‌కు పిలిపించి శాంతిభద్రతల మీద సమీక్ష జరిపాడు. ఇప్పుడు పూర్తికాలపు గవర్నర్ కాబట్టి ఇంకా స్వేచ్ఛ పెరిగిపోయింది. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశంలో ఛాన్సలర్ హోదాలో ఆయన చేసిన ప్రసంగం ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని ఉలిక్కిపడేట్లు చేసింది. ఈ రాష్ట్రానికి తానే పాలకుడన్న తీరులో వైస్ ఛాన్సలర్లను గత్తర పెట్టారాయన. పని చేస్తే వుంటారు, లేకుంటే ఇళ్లకుపోతారని హెచ్చరించారు.

శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగం ఒక లాంఛనం. రాష్ట్ర మంత్రివర్గం తయారుచేసిన ప్రసంగాన్ని యదాతథంగా చదవడం తప్ప అందులో మార్పులు చేర్పులు చేసే అధికారం గవర్నర్లకు రాజ్యాంగం ఇవ్వలేదు. కానీ రోశయ్య ప్రభుత్వం పంపిన ప్రసంగాన్ని నిశితంగా అధ్యయనం చేయడమే కాదు, అందులో తనకొచ్చిన సందేహాలను తీర్చమని ఉన్నతాధికారులను పిలిపిస్తున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు వంటి అంశాలలో తనకు మరింత సమగ్ర సమాచారం కావాలని ట్రాన్స్‌కో అధికారులను రప్పించి, మాట్లాడారు. నిజానికి గవర్నర్ ప్రసంగంపై సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వవలసింది ముఖ్యమంత్రే తప్ప గవర్నర్ కాదు. తన చేతికిచ్చిన కాగితంలోని విషయాన్ని అక్షరం పొల్లు పోకుండా చదివి లేచి వెళ్లిపోవడం మాత్రమే

కొరవ 14వ పేజీలో

## ఎస్పీ బదలీ



కొత్త ఎస్పీ దామోదర్

నెల్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మల్లారెడ్డి కడప జిల్లాకు బదలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ డిజిపి ఆఫీసులో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా వున్న ఇ.దామోదర్‌ను నియమించారు.

బదలీ మీద వెళ్లిపోయే అధికారి గురించి వ్యాఖ్యానించడం అంత మంచి సాంప్రదాయం కాదు కానీ, మల్లారెడ్డి గారు మాత్రం నెల్లూరు ఎస్పీ అనే హోదాకు గౌరవం నిలపలేకపోయారని చెప్పక తప్పదు. ఇంతకంటే సుతిమెత్తగా ఆయన పనితీరును వర్ణించడం ఎవరి తరమూ కాదు. సాధారణ ఎస్ఐకి కూడా ఆయనన్నా, ఆయన మాట అన్నా లెక్కలేదు. కానిస్టేబిళ్లకు కూడా ఎగతాళి. రాజకీయవాదులకు దాస్యం చేయడం, వారి అడుగులకు మడుగులొత్తడమే పోలీసు కర్తవ్యంగా భావించి, దాన్నే ఆచరించి ఆ శాఖ పరువు తీశాడు మల్లారెడ్డి. వైఎస్ అంత్యక్రియల సమయంలో విధి నిర్వహణలో

కొరవ 14వ పేజీలో

## కార్టూన్ స్కేప్




ప్రతిరోజూ ధరలతో పస్తులేగా...
మనకు శివరాత్రేమిటి...!

నాలుగవ వర్ధంతి



శ్రీ తిక్కవరపు ప్రద్యుమ్నకుమార్ రెడ్డి
(స్వర్గీయ తిక్కవరపు రామిరెడ్డి మనుమడు)

జననం 3-10-1953
మరణం 22-2-2006

తల్లి : తిక్కవరపు సౌజన్యమ్మ
తమ్ముడు : తిక్కవరపు ప్రభాస్‌కుమార్‌రెడ్డి
చెల్లెళ్లు : ప్రత్యూషా, ప్రియంవద

# రాహుల్ ఆవేదన

నువ్వెందుకు రాజకీయాలలోకి వచ్చావని అడిగితే ఈ వ్యవస్థ కుళ్లి పోయింది కాబట్టి, మార్చగలనేమోనన్న ఆలోచనతో అని సమాధానం చెప్పాడు రాహుల్‌గాంధీ. రోడ్డు పక్కన నిలుచుని వన్‌బై టూ టీ త్రాగుతూ దేశ రాజకీయాల మీద అనర్గళంగా అభిప్రాయాలు చెప్పే సగటు జీవి నుంచి, పార్లమెంటు భవనం దద్దరిల్లేట్లు గంభీరోపన్యాసాలు చేసే జాతీయ నేతలు వరకు ప్రతి ఒక్కరూ చెప్పే మాట - ఈ వ్యవస్థ నాశనమై పోయింది, పోతున్నదని. అయితే అందరూ చెప్పే మాటకు, రాహుల్‌గాంధీకి చాలా తేడా వుంది. మనకు గణతంత్ర రాజ్యం ఏర్పడి అరవై ఏళ్లైతే అందులో మూడు వంతుల కాలం దేశాన్ని పరిపాలించింది రాహుల్‌గాంధీ కుటుంబమే. మరొక పదేళ్లకు పైగా వారి కుటుంబ దయాదాక్షిణ్యాల మీదనే ప్రభుత్వాలు నడిచాయి. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు కలిసి దాదాపు 39 ఏళ్లు ప్రధానులుగా పని చేశారు. పి.వి.నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌లు మరొక 11ఏళ్లు సోనియాగాంధీ చలవతోనే ప్రధానులుగా వ్యవహరించగలిగారు. దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో జవహర్‌లాల్ నెహ్రూకు ధీటైన, సరి జోడి అనదగిన నేతలందరూ తమ జీవితాలను అర్పణ చేశారు కానీ, స్వాతంత్ర్యం తర్వాత మాత్రం దేశానికి జరిగిన మంచికైనా, చెడుకైనా పూర్తి బాధ్యత నెహ్రూ కుటుంబానిదే అన్న మాట నిజం. రాజకీయంగా కానీ, పాలనాపరంగా కానీ నెహ్రూ, ఇందిరా, రాజీవ్, సోనియాగాంధీలు ప్రభావితం చేసిన, ప్రవేశపెట్టిన విధానాలు, సాంప్రదాయాలు మాత్రమే ఆచరణలో వున్నాయిప్పుడు. ప్రభుత్వ వ్యవహారాలలో అవినీతి, ప్రజల సమస్యల పట్ల అలసత్వం, ప్రభుత్వ అధికారుల అసమర్ధత, ప్రభుత్వ పథకాల అమలులో వైఫల్యం, యువతకు సరైన భవితవ్యాన్ని చూపించలేకపోవడం, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో నెలకొని వున్న దారుణమైన పేదరికాన్ని నిర్మూలించలేక పోవడం, రాజకీయనాయకులు స్వార్ధపరులుగా, దోపిడీదారులుగా మారిపోవడం... ఇట్లా వ్యవస్థ పతనానికి ఏ అంశాన్ని సూచికగా, సంకేతంగా తీసుకొన్నా దానికి కారకులు, ప్రేరకులు తన కుటుంబీకులే అన్న నిజం రాహుల్‌గాంధీకి పూర్తిగా తెలుసు. అందువల్లనే ఆయన వ్యవస్థ పతనం గురించి మాట్లాడడం జాతినంతటినీ ఆకర్షించింది. చర్చకు దారి తీసింది.

అయితే తన ఉద్దేశంలో వ్యవస్థ పతనం అంటే ఏమిటో, దాన్ని సరిదిద్దడానికి తన మనసును కల్లోలం రేపుతున్న మార్గాలేమిటో రాహుల్‌గాంధీ వివరించలేదు. కానీ భవిష్యత్తులో దేశానికి నాయకత్వం వహించదగిన, మార్గదర్శనం నేర్పగలిగిన ఒక యువకుడు వర్తమాన పరిస్థితుల మీద ఇంత స్పష్టంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేయడం, తన మార్గంలో పయనించడానికి యువతను కలిసిరమ్మని ఆహ్వానించడం నిజంగా అభినందించదగిన విషయం. పాతికేళ్ల క్రితం ఆయన తండ్రి రాజీవ్‌గాంధీ కూడా ఇటువంటి ఆవేదనతో, ఆవేశంతోనే రాజకీయాలలోకి వచ్చాడు. దేశాన్ని 21 శతాబ్దంలోకి నడిపించాలని కలలు కన్నాడు. ప్రణాళికలు రచించాడు. కానీ వాటి ఆచరణలో ఆయన పూర్తిగా వైఫల్యం చెందాడు.

అయితే రాజీవ్‌కు, రాహుల్‌కు మౌలికంగా తేడాలున్నాయి. తన సోదరుడు, తల్లి మరణించిన భావోద్రేకాలతో బలవంతంగా రాజకీయాల లోకి వచ్చినవాడు రాజీవ్‌గాంధీ. దేశం గురించి, ప్రజల గురించి, వారెదుర్కొంటున్న పరిస్థితుల గురించి అవగాహన చేసుకోవడానికి ఆయనకు వ్యవధి చిక్కలేదు. కానీ రాహుల్‌గాంధీ మాత్రం దాదాపు పదేళ్లుగా దేశాన్ని అర్థం చేసుకోవడానికి అహర్నిశం ప్రయత్నం చేస్తున్నాడు. మూల మూలలు తిరుగుతూ, అన్ని వర్గాల ప్రజలను కలిసి మాట్లాడుతూ, వారి సహజీవనం చేస్తూ వారితో మమేకం కావాలని చూస్తున్నాడు. ఇదొక సత్‌ప్రయత్నం. ఒరిస్సా, బుందేల్‌ఖండ్, బీహార్ ప్రాంతాలలోని పేదరికానికి, బొంబాయి, ఢిల్లీ నగరాలలో కొద్ది మంది ధనికుల విలాస జీవితాలకు మధ్య గల వ్యత్యాసానికి కారణం ఏమిటన్న అన్వేషణ చిత్తశుద్ధితో జరుపుతున్నాడు. సమాజంలో అగాధం వంటి అంతరాలెందుకు ఏర్పడుతున్నాయో, రాజకీయాలు ప్రజల మేలు కంటే కీడుకు ఎందుకు దారి తీస్తున్నాయో అవగాహన చేసుకోవడానికి రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రయత్నం ఆహ్వానించదగింది. అది అర్థమయ్యే వరకు ప్రభుత్వ పదవులు, పాలనా పగ్గాలు చేపట్టకూడదని సంకల్పించడం ఇంకా మంచి ఉద్దేశం. ఆ కృషిలో ఆయన సఫలమవ్వాలని కోరుకొందాం.

## జనవాణి

### వైష్ణవి హంతకులను కఠినంగా శిక్షించాలి!

విజయవాడలో కిడ్నాప్ చేసి గుంటూరు పారిశ్రామికవాడలోని ఫర్నేస్‌లో వేసి చిన్నారి వైష్ణవిని బుగ్గి చేసిన సంఘటన సభ్యసమాజం సిగ్గుతో తల దించుకొనేలా చేసింది. ఇది జరిగాక తట్టుకోలేని వైష్ణవి తండ్రి ప్రభాకర్ మరణించడం గుండెలను పిండేస్తుంది. వైష్ణవి హత్య, ప్రభాకర్ మరణాలకు కారకులైన నరహంతకులను కఠినాతి కఠినంగా శిక్షించాలి. ఈ శిక్షను చూసి భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి సాహసానికి పూనుకోకూడదు.

పందిళ్లపల్లి అరుణమ్మ, నెల్లూరు

### కెసిఆర్‌ను నమ్ముకొంటే నష్టపోతారు!

తమ స్వార్థం కోసం వేర్పాటువాదానికి ఆజ్యం పోసే ఏ నేతను ప్రజలు నమ్మకూడదు. తెలుగుతల్లి కన్నా తెలంగాణ తల్లి మిన్న అని నొక్కి వక్కాణించిన తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖరరావు రేపు భారతమాత ఎవరని? దక్కన్ మాతకు జై కొట్టమన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. దొరల మనస్తత్వాన్ని నిలువెల్లా పుణికిపుచ్చుకొన్న కెసిఆర్‌ను నమ్ముకొంటే తెలంగాణ ప్రజలు అన్ని విధాల దెబ్బతినిపోతారు. ఉమ్మడి కుటుంబం, సమైక్యాంధ్ర ఒకటేనని తెలంగాణ సోదరులు గుర్తించమనవి.

కె.పెంచలయ్య, కొడవలూరు.

### డాక్టర్లు బాధ్యత మరవకూడదు!

వైద్యో నారాయణో హరిః అనే మాట ఊరకే అనలేదు. వైద్యులు ప్రాణదాతలు కాబట్టి దేవునితో సమానమన్నారు. కాని నేటి వైద్యుల్లో అంకితభావం లేదు. ధనాపేక్ష, సమ్మెలు, నిరసనలు, స్వప్రయోజనాల బాట పడుతున్నారు. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అంతటితో ఆగక తెలంగాణ డాక్టర్ల సంఘం ఏర్పడడం, వీరు ఆ ప్రాంతీయులకే వైద్యం చేస్తామనడం కన్నా ఆత్మవంచన, సామాజిక ద్రోహం ఇంకొకటి లేదు.

భట్టారం పట్టాభిరామయ్య, నెల్లూరు.

### మైపాడు బీచ్‌ను అభివృద్ధి పరచండి!

బ్రిటీష్ కాలం నుంచి మైపాడు బీచ్ ఎంతో ప్రాముఖ్యత పొందింది. కాని ఈ బీచ్‌లో ప్రాథమిక సౌకర్యాల కల్పనకు పాలకులు, అధికారులు చర్యలే కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

16-2-1940
పేజీలు : 16 వెల: అణా

### బ్యాంకి దావా

నెల్లూరు బ్యాంకు ఇసి మెంబరైన బి. సుబ్బరామానాయుడు (అల్లూరు) గారిని ప్రాథమిక సంఘంలో సభ్యుడుగా తొలగించినా ఇసిమెంబరుగా ఎన్నుకొన్నారు. కావున ఇది రద్దు చేయమని సివిల్ కోర్టులో దావా వేశారట.

### సి.రాజగోపాలాచారి రాక

ప్రధానమంత్రిగా యుండిన సి.రాజగోపాలచారిగారు 17తేది ఎక్స్‌ప్రెస్‌లో నాయుడుపేట వత్తురు. మధ్యాహ్నం పుదూరులో అల్లాడి కృష్ణస్వామయ్యగారి అతిథిగా నుందురు. అల్లాడి కృష్ణస్వామయ్యగారి చేత నాయుడుపేట ఆసుపత్రిలో కట్టించబడిన కాన్పుల వార్డుకు ప్రారంభోత్సవం చేతురు.

### రైతుబిడ్డ నిషేధము

సారధి ఫిలిమ్సు వారి రైతుబిడ్డ ఫిలిం వెంకటగిరి టవున్‌లోనే కాదు, గూడూరు డివిజన్‌లో గుడా వేయకూడదని, సినిమాటోగ్రాపు చట్టప్రకారం నెల్లూరు జిల్లా మేజిస్ట్రేటుగారు నిషేధ ఉత్తరువిచ్చారు. ఇది చాలా అక్రమం.

### చిరుతపులితో పోట్లాడుట!

నెల్లూరు జిల్లాలో అల్లూరుకు 6 మైళ్ల దూరంలో సముద్రపుటొడ్డున వుండే యిస్కపల్లి అనే గ్రామంలోనికి ఒక చిరుతపులి తప్పించుకొని వచ్చి వూరు వెలుపల పొదలలో వుండింది. ఇది గ్రామస్తులకు తెలిసి కండిశెట్టి సుబ్బులు అనే అతని నాయకత్వాన 50మంది కర్రలతోను, ఈటెలతోను దానిని చంపుటకు పోయిరి. సుబ్బులు ఈటెతో పులిని పొడిచినాడు. మిగతా వారందరును పరుగెత్తిపోయినారు. పోలీసులు వెళ్లి పొదలో పడియున్న పులిని చంపారు. సుబ్బుల్ని చికిత్సకై నెల్లూరు జిల్లా ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాదస్థితిలో వున్నాడు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

12-2-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### బిట్రగుంటలో విషాద సంఘటన!

పెద్ద కుమార్తెను ఎవరికిచ్చి వివాహం చేయాలనే విషయంలో కలిగిన గృహచ్ఛిద్రం బిట్రగుంటలో ఐదు నిండుప్రాణాలను బలిగొన్నట్లు తెలుస్తున్నది.

బిట్రగుంట రైల్వే వుద్యోగి వెంకయ్య భార్య తన నలుగురు కుమార్తెలను ఉలవపాళ్లలోని శివాలయం కోనేరుకు అప్పగించి, తాను రైలు క్రింద బడి ఆత్మహత్య చేసుకుంది. చనిపోయిన ఆ బిడ్డల వయస్సు 11, 8, 6, 5 అని వారు బిట్రగుంటలోని రైల్వే పాఠశాలలో చదువుకుంటున్నారని తెలుస్తున్నది.

ఈ సాహసకృత్యానికి ఒడి కట్టిన ఆ తల్లి, గత 29తేది మధ్యాహ్నం టిఫిన్ క్యారియర్‌తో పాఠశాలకు పోయి, పిల్లలకు అన్నంపెట్టి, తాతగారి వూరికి పోదాం రమ్మని వారిని కూడా తీసుకొని వచ్చిందని, ఆ రోజు రాత్రే ఆ బిడ్డలను కోనేరులో వేసిందని, తానుగూడా రైలు క్రింద బడి ఆత్మహత్య చేసుకున్నదని అంటున్నారు. మరురోజు ఉదయం బిడ్డల శవాలు కోనేరులో తేలి వుండడం; తల్లి శవం రైలు కట్ట మీద పడి వుండడం 30 తేది ఉదయం కనుగొనబడింది.

పెద్ద కుమార్తెను ఎవరికివ్వాలనే విషయంలో కలిగిన అభిప్రాయభేదాలే ఈ దారుణ విషాద సంఘటనకు కారణమంటున్నారు. రైల్వే పోలీస్ విచారణ సాగిస్తున్నది.

### డాక్టరు రాజగోపాలన్

సర్జరీలో సమర్థుడుగా పేరు బొందిన క్షయాసుపత్రి డాక్టరు రాజగోపాలన్ గారిని గుంటూరు వైద్య కళాశాల ప్రొఫెసరుగా మార్చి; వారి స్థానంలో పాతడాక్టరు భావనారాయణ గారిని నియమించారు. వైద్య వృత్తిలో సీనియారిటీ కంటే సమర్థతకు; ఇతర స్వల్పలోపాల కంటే సేవకు ప్రాధాన్యం, విలువ ఇవ్వడం వుచితము, అవసరము అని మా అభిప్రాయం.

# నెల్లూరు ముచ్చట్లు

## జాతీయ రహదారిపై ఒక వైపే ట్రాఫిక్!

నెల్లూరు నగర శివారులోని ఐదవ నెంబరు జాతీయ రహదారిపై ఎన్టీఆర్ నగర్ ప్రాంతం నుంచి బుజబుజ నెల్లూరు వరకు ఒకవైపే ట్రాఫిక్‌ను అనుమతిస్తుం డడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బం దులు తప్పడం లేదు. నాలుగులైన్ల జాతీయ రహదారిపై మరమ్మత్తుల పేరిట గత కొన్ని రోజులుగా ఒకవైపే ట్రాఫిక్ నడపడం మంచిది కాదు. నేషనల్ హైవే అధికారులు ఈ విషయాన్ని తక్షణం పరి శీలించి పరిష్కరిస్తే బాగుంటుంది.

## బిజెపి జిల్లా అధ్యక్ష పదవికి పోటీ!

జిల్లాలో వునికిని కోల్పోయిన భార తీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ ఏర్పడడం చర్చనీయాంశమ య్యింది. కర్నాటి ఆంజనేయరెడ్డి, కందు కూరి సత్యనారాయణ ఈ పదవి కోసం పోటీ పడుతున్నారు. సయోధ్య కోసం ఈ ఎన్నికను వచ్చేవారానికి ఆ పార్టీ నాయకులు వాయిదా వేశారు.

## ధరలు తగ్గించని వ్యాపారులు!

పంట చేతికి రావడం, ప్రభుత్వం తీసుకొన్న వివిధ చర్యల మూలంగా నిత్యావసర వస్తువుల ధరలు హోల్‌సేల్ మార్కెట్‌లో కాస్త తగ్గాయి. కాని రిటైల్ వ్యాపారులు ధరలు ఏమాత్రం తగ్గించ కుండా అమ్మకాలు చేస్తూ ప్రజలను దోచుకొంటున్నారు. గత నెలలో కిలో 90రూపాయలమ్మిన కందిపప్పు ప్రస్తు తం 60రూపాయలయ్యింది. పెసలపప్పు 90 నుంచి 76 రూపాయలు, మినపప్పు 75 రూపాయల నుంచి 60 రూపాయలు, వేరుశనగపప్పు 60 రూపాయల నుంచి 52 రూపాయలు, ఎరగడ్డలు 26రూపాయల నుంచి 20 రూపాయ లైనా తగ్గించి అమ్మడమే లేదు. పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధి కారులు సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొని కిరణా అంగళ్లను ఒకసారి తనిఖీ చేస్తే ధరలు తగ్గముఖం పట్టే అవకాశం వుంది.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ పేటాంక్స్ట్రీట్‌రోడ్, నెల్లూరు. సెల్: 9246435618, 9849495615

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

## పెద్ద దొంగతనం - దొరికిన దొంగ!

నెల్లూరు చిన్నబజారు కాకర్లవారివీధిలోని ఎస్వీఆర్ జ్యూవెల్స్‌లో 8తేది తెల్లవారు జామున దొంగలు పడి 73లక్షల రూపాయల నగదు, రెండు కిలోల బరువుండే బంగారు బిస్కెట్లు పట్టుకెళ్లారు. ఈ షాపు యాజమాని కె.శ్రీనివాసులు బంగారు అమ్మకంతోపాటు షేర్ల ఆన్‌లైన్ బిజినెస్ కూడా చేస్తారు. 7తేది అర్థరాత్రి వరకు ఆ లెక్కాపక్కలు చూసి షాపు మిద్దెపైనున్న ఇంట్లో నిద్రపోయారు. సోమవారం ఉదయం షాపులోనికి వచ్చి చూడగా చోరీ అయిన విషయం బయట పడింది. సేఫ్‌లాకర్, గ్లాస్‌డోర్, షట్టర్‌కు వేసిన తాళాల్లో ఏ ఒక్కటీ పగులగొట్టకుండా లాకర్లలో వుండే మొత్తం పట్టుకెళ్లడం విశేషం. అదే రోజు తెల్లవారు జామున ఈ ప్రాంతంలో ఐదులక్షల రూపాయలతో కొందరు వ్యక్తులు నైట్‌బీట్‌లో వున్న పోలీసులకు పట్టుబడడం పలు అనుమానాలను రేకెత్తించింది. కోటి రూపాయలకుపైగా దోపిడీ జరగడం ఈ ప్రాంతంలో ఇదే తొలిసారి కావడంతో మిస్టరీ ఛేదించను నగర పోలీసులు పని ప్రారంభించారు. ఎట్టకేలకు వారి కృషి ఫలిం చింది. ఈ దొంగతనం చేసింది. ఈ అంగడిలో గుమస్తాగా పని చేసే దినేషనని పోలీసులు గుర్తించారు. 10తేదీ ఇతన్ని అరెస్ట్ చేశారు.

## జిల్లాలో మళ్లీ భూపంపిణీ!

జిల్లాలో ఐదవ విడత భూపంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఏప్రిల్ 14తేది జరిగే అంబేద్కర్ జయంతి వేడు కల్లో 13,573 ఎకరాల భూమిని పంచాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో నాలుగు విడతలుగా జరిగిన భూపంపిణీలో 52వేల ఎకరాలను 40వేల మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి కులస్తు లకు ఇంతవరకు పంచారు.

## కిసాన్ సెజ్‌కు రిజర్వాయర్ నీళ్లు!

దగదర్తి మండలంలో ఏర్పాటు చేయనున్న ఇఫ్కో కిసాన్ సెజ్‌కు 0.6 టిఎంసిల నీటిని కనిగిరి రిజర్వాయర్ నుంచి యేడాది పొడవునా విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం వుత్తర్వులు జారీ చేసింది. ఈ నీటిని దగదర్తి - ముంగమూరు ఛానల్ (డిఎం) ద్వారా సరఫరా చేస్తారు. సోమశిల ప్రాజెక్టు నుంచి గాక కనిగిరి రిజర్వాయర్ నుంచి ఈ నీటిని విడుదల చేయడాన్ని ఈ ప్రాంత రైతులు వ్యతిరేకిస్తున్నారు. కాని రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు ఈ విషయాన్ని ఇంకా సీరియస్‌గా తీసుకోలేదు. వుద్యమ పథాన సాగే ఆలోచన చేయడం లేదు.

## నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నెల్లూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మార్చి 3తేది జరుగుతుంది. కార్యదర్శి, ఐదుగురు కార్యవర్గ సభ్యు లను ఎన్నుకోను రహస్య బ్యాలెట్ పద్ధతిన ఎన్నిక నిర్వహిస్తారు. నామినేషన్లు ఫిబ్రవరి 17తేదీ వరకు దాఖలు చేయవచ్చు. 19తేది నామినేషన్ల వుపసంహరణకు చివరిరోజు. 1500 మంది న్యాయ వాదులు నెల్లూరుబార్ అసోసియేషన్‌లో సభ్యులుగా వున్నారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది విసివి.ప్రసాద్ వ్యవహరిస్తారు.



నెల్లూరు బాలాజీనగర్‌లోని స్వామిదాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు బహుమతులు పంచుతున్న యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీసు చీఫ్ మేనేజర్ ఎం.అర్జునన్.

## స్థానికులకు ఉద్యోగాలివ్వండి!

జిల్లాలో స్థాపిస్తున్న వివిధ పరిశ్రమలలో స్థాని కులకు వుద్యోగాలివ్వమని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ పరిశ్రమల నిర్వాహకులను కోరారు. 9తేది కలెక్ట రేట్‌లో వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఈ విష యమై ఒక సమావేశం నిర్వహించారు. ఎస్‌టిక్యూ పరిశ్రమలో స్థానికేతరులకు వుద్యోగాలివ్వడాన్ని కలెక్టర్ ఆక్షేపించారు. స్థానికులకు వుద్యోగాలిస్తే పరి శ్రమలు అభివృద్ధి చెందుతాయన్నారు. వివిధ పరి శ్రమలలో పని చేసేందుకుగాను మానవ వనరుల అభివృద్ధికి రెండు కోట్లరూపాయలతో నెల్లూరులో శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటిం చారు.

## బ్రాహ్మణ సేవా సంఘం

బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా నెల్లూరు సప్తగిరి లాడ్జి అధినేత వెల్లంచేటి చంద్రమౌళి ఎన్నికయ్యారు. 7తేది ఖమ్మంలో ఈ ఎన్నిక జరిగింది.

## నెల్లూరీయునికి హింద్‌రత్న అవార్డు!

అమెరికాలో ప్రవాసాంధ్రునిగా స్థిరపడి భారతదేశ సంస్కృతి పట్ల ఆ దేశ ప్రజలకు మక్కువ కలిగించే విధంగా కృషి చేసే వ్యక్తులకు అక్కడి

కొరవ 14వ పేజీలో

ప్రథమవర్ధంతి



దొడ్డవరపు శంకరమ్మ
W/O స్వర్గీయ దొడ్డవరపు కామాక్షయ్య Ex M.P
స్మరించుకుంటూ...

కుమారులు : దొడ్డవరపు ప్రభాకర్‌రావు
దొడ్డవరపు శ్రీనివాసరావు
మరియు కుటుంబ సభ్యులు

# నగరంలో చకచకా పనులు!



పొదలకూరురోడ్డులో పైపులైను వేయడానికి త్రవ్విన గుంటలు.

కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తుండడంతో నగరంలో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన పనులను రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి చకచకా చేయిస్తున్నారు. పొదలకూరు రోడ్డులో గతంలో వేసిన పైపులైను విఫలమై ప్రతినిత్యం నీళ్లు వదలగానే ఏదోఒక ప్రాంతంలో పైపులు పగిలిపోయేవి. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని డికెడబ్ల్యు కాలేజి నుంచి కొత్త పైపులైను పనులను చకచకా చేస్తున్నారు. నాలుగు రోజుల్లో ఈ పని ఎస్పీ బంగ్లాను దాటేసింది. సామర్థ్యం పెంచి వేస్తున్న ఈ పైపులైను పనులు నిజంగానే మార్చి నెలాఖరుకు పూర్తయితే పొదలకూరు రోడ్డు ప్రాంతంలో నీటిసమస్య పరిష్కారమవుతుందనే

### కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్నాయనా?

చెప్పాలి. నగరంలోని పలు కాలనీల్లో నివసించే ప్రజలకు గతంలో ఇళ్లస్థలాలనైతే ఇచ్చారు కాని పట్టాలివ్వలేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వేలమందికి పట్టాలివ్వబోతున్నారు. గతవారంలో నగరంలోని పొదుపు గ్రూపులకు కరవు కాలంలోనూ కోటి రూపాయలకు పైగా రుణాలివ్వడానికి ఎన్నికలే కారణమనక తప్పదు. నగరంలో అభివృద్ధికి నోచని ముస్లిం ప్రాంతాలకు నిధులివ్వడం సైతం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనేనని చెప్పాల్సి వస్తున్నది. సిమెంటు రోడ్లు, కాలువల పనుల ప్రారంభోత్సవాల్లో సైతం నగర ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ పాల్గొంటున్నారు. ఎన్నికలు వస్తే తప్ప నేతలకు పనులు చేయను బుద్ధిపుట్టదు. కాబట్టి తరచూ ఎన్నికలను కోరుకొందామా?

# దొంగలు బాబోయ్ దొంగలు



కాకర్లవారి వీధిలో దోపిడీ జరిగిన ప్రదేశంలో పోలీసు అధికారులు.

నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిత్యం రద్దీగా వుండే ప్రాంతాలతోపాటు జనసంచారంలేని చోట్ల దొంగలు జొరబడి పెద్ద మొత్తంలో నగలు, నగదు తస్కరించుకొని వెళ్తుండడంతో ఇంటికి తాళం వేసి బయటకి వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఇటీవల వారంరోజుల వ్యవధిలో పలుచోట్ల దొంగతనాలు జరగడం పోలీసుల వైఫల్యాన్ని తెలియజేస్తుంది. కాకర్లవారి వీధిలోని బంగారు దుకాణంలో 8వ తేది జరిగిన కోటి రూపాయలు విలువచేసే బంగారు, వెండి వస్తువుల చోరీ ప్రజలను విస్తుపోయేలా చేసింది. ఈ మధ్య సరస్వతినగర్‌కు చెందిన చిట్టమూరు శ్రీనివాసులరెడ్డి ఇంట్లో దొంగలుపడి 30సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, 50వేల రూపాయల నగదు దొంగిలించుకెళ్లారు. శోధన్‌నగర్‌లోని ఒక ఇంట్లో పట్టపగలు దొంగలు పడి లక్షల విలువ చేసే నగలు, పెద్ద మొత్తంలో డబ్బు తస్కరించారు. అలాగే మాగుంట లే అవుట్‌లో నారాయణ హాస్పిటల్‌లో పని చేసే వైద్యుడి ఇంట్లోను దొంగతనం జరిగింది. పోలీసులు తగినచర్యలు చేపట్టకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# స్కూల్ కిట్స్ పంచిన వేమిరెడ్డి!

చెన్నైలోని అంబత్తూరు ప్రాంతంలోని రోటరీ క్లబ్, కెనడా దేశస్తులు అందించిన సహకారానికి నెల్లూరు వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన సాయం జత కలిపి 5తేది డి.కె.డబ్ల్యు కాలేజిలో 650మంది పిల్లలకు స్కూల్ కిట్స్

### డికెడబ్ల్యు కాలేజిలో 650 మందికి పంపిణీ

పంపిణీ చేశారు. గత ఏడాది కూడా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. పేదరికంతో బాధపడే



స్కూల్ పిల్లలకు కిట్స్ పంపిణీ చేస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అంబత్తూర్ రోటరీ క్లబ్ సభ్యులు.

విద్యార్థులను ఆదుకోవడంతోపాటు అంగవైకల్యం, ఆకలి బాధలతో ఇబ్బందిపడే వారికి తన చేతనైన సాయం చేస్తానని ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమ కోఆర్డినేటర్ వి.సాయిభాస్కర్‌రెడ్డి కూడా ఈ సాయం అందజేతలో పాలు పంచుకొన్నారు.

### దుబాయ్, షార్జాలలో

# నెల్లూరు కళాకారుల ప్రదర్శన

నెల్లూరీయులు మురళీఆర్ట్స్ సంస్థను స్థాపించి వినోదం పంచే కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో పేరుగాంచిన శింగంశెట్టి మురళీమోహన్‌రావు, దోర్నాల హరిబాబులకు దుబాయ్, షార్జాలలో నవ్వుల్-నవ్వుల్ కార్యక్రమం చేసే




దుబాయ్‌లో ప్రదర్శన ఇస్తున్న నెల్లూరు కళాకారులు.

ఛాన్స్ వచ్చింది. గతవారం దుబాయ్, షార్జాలోని తెలుగు లలిత కళాసమితి, రసమయి సంస్థల ఆధ్వర్యంలో దుబాయ్‌లోని ఉమెన్స్ హైటెక్ కాలేజిలోనూ, షార్జాలోని తెలుగు అసోసియేషన్ ప్రాంగణంలో మురళీఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన నవ్వుల్-నవ్వుల్ కార్యక్రమానికి హాజరైన వారు పొట్టచెక్కలయ్యేలా నవ్వారు. మురళీ ఆర్ట్స్ కళాకారులను దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్ జనరల్ సి.జె.రాజమణి సన్మానించారు.

# అనధికార విద్యుత్ కోత

### ట్రంకురోడ్డులోనే ఇలా వుంటే ఎలా?



కోటమిట్టలో హైఓల్టేజి మూలంగా కాలిపోయిన టీవీలతో ప్రజలు.

నెల్లూరు నగరంలో తరచూ అప్రకటిత విద్యుత్‌కోత విధిస్తున్నారు. ముందుగా ప్రకటించకుండా వేళాపాళా లేకుండా విధిస్తున్న కోతకు జనం నానాకష్టాలు పడుతున్నారు. మామూలుగా ఎండాకాలంలోనూ నగరంలో విద్యుత్‌కోత వుండేది కాదు. కాని ఈయేడాది చలికాలమైన జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రివేళ అనే తేడా లేకుండా విద్యుత్‌కోత విధిస్తున్నారు. నగర నడిబొడ్డు ప్రాంతమైన పొగతోటలో గత పక్షంరోజులుగా ఏ సమయంలో విద్యుత్ వుంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనింది. ఈ ప్రాంతంలో లెక్కలేనన్ని ఆసుపత్రులుండడంతో ఉదయం పూట ఆపరేషన్లు, ఆ తర్వాత రోగుల స్వాంతనకు విద్యుత్ కోత ఇబ్బందికరంగా తయారయ్యింది. విద్యుత్ ఆగిన విషయాన్ని సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి చెప్పినా ఫలితముండడం లేదు. దర్గామిట్టలోని విద్యుత్ భవన్‌లో వున్న సెంట్రల్ కంప్లైట్ సెల్‌కు ఫిర్యాదుచేస్తే వారేమో స్థానిక సబ్‌స్టేషన్ నెంబరిచ్చి సరిపెడుతున్నారు. గతంలో ఏ ప్రాంతంలో విద్యుత్ కోత విధిస్తున్నారో ముందురోజు పత్రికల్లో ప్రకటించేవారు. ప్రస్తుతం అటువంటివేమి లేవు. సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్లు కొట్టాలంటూ జనం ఇళ్లలో వుండే ఆదివారం పూట కూడా విద్యుత్‌కోత విధిస్తూ వారికి సెలవు రోజు నరకాన్ని చవిచూపిస్తున్నారు విద్యుత్ సిబ్బంది. నగరంలో విద్యుత్ కోతకు కారణాలను విద్యుత్ శాఖాధికారులు వెల్లడించడం లేదు. విద్యుత్ కోతకు తోడు కొన్ని ప్రాంతాల్లో హైఓల్టేజి సమస్య జనాన్ని ఇబ్బంది పెడుతున్నది. ఇటీవలే కొత్త సబ్‌స్టేషన్ ప్రారంభించిన కోటమిట్ట ప్రాంతంలో 6తేది హైఓల్టేజి రావడంతో 100కి పైగా టీవీలు కాలిపోయాయి. చలికాలంలోనే ఎడాపెడా విద్యుత్‌కోత విధిస్తున్న అధికారులు ఎండాకాలంలో ఏం చేస్తారోనన్న బెంగ ఇప్పటి నుంచే నెల్లూరీయులకు పట్టుకుంది.

# ఆయుష్ డెంటల్ హాస్పిటల్

### నెల్లూరులో మరో సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల



డాక్టర్ ఉస్మాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యేల ద్వయం వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ.

దంత సమస్యలతో బాధపడేవారికి మెరుగైన చికిత్స అందజేసేందుకు దంత వైద్యంలో విశేష అనుభవం గడించిన డాక్టర్ ఉస్మాన్ ఆయుష్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. నెల్లూరు రామలింగాపురం అండర్‌బ్రిడ్జి వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక వైద్యపరికరాలతో ఏర్పాటుచేసిన ఈ హాస్పిటల్‌ను రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి ప్రారంభించారు. అతిథులుగా నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ రమాదేవి తదితరులు హాజరయ్యారు. ఆయుష్ హాస్పిటల్‌లో అందించే దంతవైద్యం గురించి డాక్టర్ ఉస్మాన్ చెబుతూ అన్నిరకాల దంత సమస్యలకు మెరుగైన వైద్యసేవలను అందించనున్నట్లు చెప్పారు. రంగుమారిన పళ్లకు చికిత్స, వంకర పళ్లను, ఎత్తు పళ్లను సరి చేయడం, రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్, దవడకు సంబంధించిన అన్నిరకాల సర్జరీలు, చిగుళ్లవ్యాధికి చక్కని చికిత్స అందిస్తామని తెలిపారు. నల్లగా మారిన పాత సిల్వర్ సిమెంట్‌కు ఉచితంగా పంటిరంగుతో ఫిల్లింగ్ చేయడం తమ ప్రత్యేకతని తెలిపారు. చిన్నపిల్లల్లో వచ్చే దంత సమస్యలకు ప్రత్యేకచికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు పళ్లు పుచ్చిపోకుండా వుండేందుకు తక్కువ ఫీజుతో దంత వైద్యాన్ని అందిస్తామన్నారు. పాత, విరిగిన ఫిక్స్‌డ్ కట్టుడు పళ్లను 50శాతం రాయితీతో క్రొత్త సిరామిక్ దంతాలను అమరుస్తామని తెలిపారు.

# సమస్యల లోగిళ్లు వెంకటగిరి హాస్టళ్లు!

● అల్లాడుతున్న విద్యార్థులు

పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన హాస్టళ్లు సమస్యల లోగిళ్లయ్యాయి. చదువుకొనేందుకు కుటుంబాలకు దూరంగా హాస్టళ్లలో వుండే విద్యార్థులు సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోంది. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో అధిక సంఖ్యాక హాస్టళ్ల పరిస్థితి ఇది. ఇక్కడ ముప్పైకు పైగా ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహాలున్నాయి. కొన్నింటికి సొంత భవనాలు వున్నా ఎక్కువ భాగం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పట్టణంలో 6 ఎస్సీ, 3 బిసి, ఒక ఎస్టీ హాస్టల్ వున్నాయి. ఇవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. డక్కిలి మండలంలో 3 హాస్టళ్లు వుండగా మండల కేంద్రంలో వుండే ఎస్సీ బాలుర వసతిగృహం రేకుల గదిలో నడుస్తుండడంతో పిల్లలు పలు అవస్థలు పడాల్సి వస్తోంది. బాలాయపల్లి మండలంలోని నాలుగుహాస్టళ్లు, రాపూరు మండలంలోని ఆరుహాస్టళ్లలో అధికభాగం అద్దె గదులలోనే కొనసాగుతుండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. కలువాయి మండలంలో 5 హాస్టళ్లు వుండగా దామూరులోని బిసి వసతి గృహానిదీ ఇదే తీరు. సైదాపురం మండలంలో వున్న రెండు హాస్టళ్లకు సొంతభవనాలు ఉన్నప్పటికీ సౌకర్యాలు లేకపోవడంతో అక్కడ వుండే విద్యార్థులు ఇబ్బంది పడాల్సివస్తోంది. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించైనా అధికారులు హాస్టళ్లలో కనీసవసతులు సమకూర్చాల్సి వుంది.



జిల్లా పోలీసుల పునశ్చరణ తరగతుల్లో భాగంగా వారి పనితీరును పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజి కిషోర్‌కుమార్.

● ముత్తుకూరులో పెరిగిన

## పోలీసుల సంపాదన

పోర్టు, పరిశ్రమల స్థాపనలతో జల్సా

ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు, రిలయన్స్, జెన్‌కో కంపెనీలు విద్యుత్‌శక్తి పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి ఎలా వున్నా పోలీసులకు మాత్రం రెండు చేతులా సంపాదనైంది. పోర్టు పెట్టిన నాటి నుంచి వాహనాల రాకపోకలు పెరగడం, వివిధ అవసరాల నిమిత్తం తిరిగే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయి. పోర్టులో సిబ్బంది, ఇతరత్రా అవసరాల కోసం చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి మంచినీటిని సరఫరా చేసేందుకు 60కు పైగా ట్యాంకులు నిత్యం తిరుగుతుంటాయి. వీటి నుంచి పోలీసులు మామూళ్లు వసూలు చేస్తుంటారు. ఒక్కో వాహనం నుంచి నెల నెలా వెయ్యి రూపాయలు ఇవ్వాలని వారితో ఒప్పందం కుదుర్చుకొని దాని ప్రకారం నెలకు 60వేల రూపాయలకు పైగా వసూలు చేస్తుండడంతో వాహనాల యజమానులు అల్లాడిపోతున్నారు. లేదంటే రకరకాల కారణాలు చూపి వాహనాలను తిరగనీయకుండా ఇబ్బంది పెడుతున్నారట. వీటితోపాటు పోర్టుకు వచ్చే వాహనాల నుంచి అందినంత దండుకోవడం ముత్తుకూరు పోలీసులకు రివాజైంది.



గాంధీజీ వర్ధంతి సందర్భంగా కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న గాంధీజీ విగ్రహ స్థాపక కుటుంబ సభ్యులు అమ్మ ఫర్నిచర్ అధినేత గద్దం సుధాకర్‌రెడ్డితో స్కూల్ కరస్పాండెంట్ జెవి.రెడ్డి తదితరులు.

## మూలపడ్డ ట్రాక్టర్లు!

పట్టించుకోని గూడూరు మునిసిపాలిటీ

గూడూరు మునిసిపాలిటీలో మంచినీటి సరఫరా కోసం కొనుగోలు చేసిన వాహనాలు మూలనపడ్డాయి. పదేళ్ల క్రిందట నీటి సరఫరాకు రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. చిన్న చిన్న మరమ్మత్తులు చేయించాల్సివుండగా వాటిని పట్టించుకోకపోవడంతో అవి కాస్త తుప్పుపట్టి దేనికి పనికి రాకుండా పోయాయి. వాటి స్థానంలో ఐదు సంవత్సరాల క్రితం రెండు లక్షల రూపాయలు వెచ్చించి మరో ట్యాంకర్ కొన్నారు. అది కాస్త మరమ్మత్తులకు గురికావడంతో క్రొత్తగా మరో రెండు ట్యాంకర్లు కొన్నారు. చిన్న చిన్న రిపేర్లు చేయించడంలో నిర్లక్ష్యం వహించడంతో లక్షలు వెచ్చించి కొన్న వాహనాలు శిథిలమైపోయాయి. వీటిలో పనికి వచ్చే భాగాలను చిల్లరదొంగలు తీసుకొనిపోయి ఇనుపసామాన్ల అంగళ్లలో అమ్ముకొంటున్నారట. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు వాహనాల విషయమై శ్రద్ధ కనపరచకపోవడంతో ప్రజాధనం వృధా అవుతోంది.



నెల్లూరు తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళన కార్యక్రమంలో కవయిత్రి యద్దల లలితను సన్మానిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి. ప్రక్కన డాక్టర్ సుధాకర్, మురళీమోహన్‌రాజు, మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు హనుమంతరావు.




శ్రీమతి అక్కరాజు లక్ష్మి

జననం : 10-03-1936 మరణం : 14-02-2001

బాష్పాంజలి - తొమ్మిదవ వర్ధంతి

| | |
|---|---|
| భర్త | : A.T. శ్రీనివాసరావు<br>Retd. HOD, V.R.C, Nellore |
| కుమారుడు | : A. వెంకటరమణ, M.Tech<br>C.A.O Indian Ports Association, New Delhi |
| కోడలు | : A. సుష్మ, B.Tech, |
| కుమార్తెలు | : R.S. భువనేశ్వరి, MA MEd.,<br>K. జానకి, MSc., BEd.,<br>T. పద్మజ, MSc, Phd., (USA) |
| అల్లుళ్లు | : Major General R.S. Kumar,<br>CEO. NSDM, New Delhi<br>Dr. K.V.L.N. Rao, BSc., MBBS<br>Dr. TVSH. Prasad, M.S. Phd.,U.S.A |
| మనుమలు | : R. ధీరజ్, 3rd year MBBS<br>A. విశ్వధృత్ |
| మనుమరాళ్లు | : M. కామాక్షి, BA., MBA (USA)<br>R. సంధ్య, B.Tech (USA)<br>R. విష్ణుప్రియ, 2nd year B.Tech<br>J. జ్యోత్స్న, B.Tech (USA)<br>A. ఋతిక, T. శ్రావ్య, T. సౌమ్య |


## అవగాహన సదస్సులో ఒకే ఒక్కడు!

ఎంపిటిసిల చైతన్య సదస్సులో చిత్రమిది

ఎంపిటిసిలను చైతన్యపరచేందుకు, వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు టెలివిజన్ ద్వారా శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీని కోసం జిల్లావ్యాప్తంగా ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. ఎంపిడివోలు ముందుగా ఎంపిటిసిలకు సమాచారం అందించినా ఎక్కడా సభ్యులు హాజరైన దాఖలాలు వుండడం లేదు. ఇటీవల గూడూరు ఎంపిడివో కార్యాలయంలో ఈ శిక్షణా కార్యక్రమం కోసం 15 మంది ఎంపిటిసిలను ఆహ్వానించగా ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. అందరూ వస్తారని అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు భోజనాలను సిద్ధం చేసినా ఎంపిటిసిలు ఎగనామం పెట్టడంతో పాపం... ఇన్‌ఛార్జి ఎంపిడివో కరీముల్లా ఒక్కడే ఈ టెలి శిక్షణా కార్యక్రమంలో కూర్చొన్నాడు. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాలలోని అధికారులకు ఎదురౌతున్నాదట.



విశిష్ట సాంస్కృతిక సేవలకు రిపబ్లిక్ డే పెరేడ్‌లో సభాసామ్రాట్ బి.వి.నరసింహంకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాంగోపాల్. మధ్యలో ఎస్పీ మల్లారెడ్డి వున్నారు.

## కలువాయి పిహెచ్‌సి తనిఖీ

కలువాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పని తీరు డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణారెడ్డికి ఆగ్రహం తెప్పించింది. కలువాయికి వచ్చిన ఆయన పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా వుండడం, గదుల్లో స్టాకు చెల్లాచెదురుగా పడి వుండడాన్ని చూసిన ఆయన సిబ్బందిపై మండిపడ్డారు. ఇలాగేనా ఆస్పత్రి వుండాల్సింది, మీ ఇళ్లలో ఇట్లే పెట్టుకుంటారా అంటూ ఆగ్రహించారు. కుటుంబ నియంత్రణ, ఇమ్యూనైజేషన్‌లో వెనుకబడి వుండడంపై ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. రికార్డులు

**వైద్య ఆరోగ్య సిబ్బందిని మందలించిన డిఎంఅండ్‌హెచ్ఓ**

సక్రమంగా లేకపోవడం, వ్యాక్సిన్‌లు ఇతర మందుల వివరాలు సైతం పుస్తకాల్లో సక్రమంగా వ్రాసివుండకపోవడంతో అనుమానం వచ్చిన డిఎంహెచ్‌వో వాటిని స్వాధీనం చేసుకొన్నారు. తన సర్వీసులో ఇంత చెత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చూడలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు మరింతగా విచారణ చేస్తే ఆస్పత్రికి వచ్చే నిధులు ఏమవుతున్నది, అత్యవసర వైద్యానికి అందించే 10వేల రూపాయలు ఎలా ప్రక్కదారి పడుతున్నది, కుక్కకాటు వ్యాక్సీన్‌లు లేకపోవడం వంటివి బట్టబయలౌతాయి.

• ఇందుకూరుపేటకు

## రెండవ పంట

**24వేల ఎకరాలకు నీరు**

సోమశిల జలాశయం పరిధిలో రెండోపంటకుగాను నీటిని విడుదల చేయడంతో ఇందుకూరుపేట మండలంలో 24వేల ఎకరాలకు ప్రయోజనమైంది. ఇందుకూరుపేట సర్కిల్ పరిధిలోని ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాలకు సంబంధించి జాఫర్‌సాహెబ్ కెనాల్, లేబూరు కాలువ, కుడితిపాళెం, మైపాడు, వెంకన్నపాళెం, కోడూరు, మాదర్లవారిపాళెం కాలువల ద్వారా మొత్తం 24వేల ఎకరాలకు నీరు విడుదల కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్వేపల్లి కాలువ పరిధిలో 18వేల ఎకరాలకు రెండో పంటకు నీరు విడుదలైంది.

## వరిపైరుకు మోము పిప్పి

### రైతుల్లో ఆందోళన

వరి పంటకు సోకిన తెగుళ్లు రైతులకు ఆందోళన కల్గిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో వరిసాగు చేస్తున్న అన్నిచోట్లా ఇదే సమస్య. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో తెగుళ్లు పంటలను పట్టిపీడిస్తుండడంతో రైతులు దిగాలుపడివున్నారు. వాతావరణం సరిగా లేకపోవడంతో ఆలస్యంగా వేసిన వరిపైర్లకు తెగుళ్లు సోకడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో వుంది. పలురకాలుగా నష్టపోయిన రైతులు వరిపైరును సాగు చేసినప్పటికి వారిని కష్టాలు వీడడం లేదు. రేబాల గ్రామ పరిసరాల్లో సాగులో వున్న 70 ఎకరాల్లో మోము పిప్పి తెగులు సోకి వరిపైరుకు తీవ్ర నష్టం జరుగుతున్నదని రైతులు వాపోతున్నారు. పంచేడు, మినగల్లు గ్రామాల్లో షుమారు 160 ఎకరాల్లో అగ్గితెగులు సోకి వుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా, పలురకాల మందులు వాడినా ప్రయోజనం వుండడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగుళ్ల కారణంగా నెల్లూరు మసూరిపైరు ఎక్కువగా దెబ్బతింటున్నట్లు రైతులు చెప్తున్నారు. అప్పుసొప్పుచేసి వరి పంట సాగుచేస్తున్న తమకు తెగుళ్లు సోకడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## చెట్ల క్రింద చదువులు

• తాటిపర్తి హైస్కూల్ దుస్థితి

విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలు, అవగాహనా రాహిత్యం వలన ఎలాంటి వైఫల్యాలు ఎదురౌతాయో తెలియజెప్పేందుకు పొదలకూరు మండలంలోని పాఠశాలలు ఒక ఉదాహరణ. మండలంలోని ఆర్వైపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ, తరగతి గదులు ఎక్కువగా వుంటే, తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అధికసంఖ్యలో విద్యార్థులు వుండి వారికి తగినన్ని తరగతి గదులు లేక చెట్ల క్రింద చదువుకోవాల్సిరావడం అతివృష్టి, అనావృష్టిని తలపిస్తోంది. ఆర్వైపాళెం స్కూలులో విద్యార్థులు కేవలం 29 మంది. వీరికి ఐదుగురు ఉపాధ్యాయులు వున్నారు. అనేక గదులు విద్యార్థులు లేక ఖాళీగా వున్నాయి. మరోవైపు తాటిపర్తి జడ్పీహైస్కూలులో 206 మంది విద్యార్థులు వుండగా, వీరికి కేవలం రెండే తరగతి గదులు వుండడం చెప్పుకోవాల్సిన విషయం. గదులు చాలకపోవడంతో ఆరుబయట చెట్లక్రింద, వరండాలో విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. అందులోనూ ఈ స్కూలును సక్సెస్ పాఠశాల క్రింద గుర్తించి వున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల అవసరాలను దృష్టిలో వుంచుకొని పాఠశాలలో తగిన ఏర్పాట్లు చేయాల్సి వుంది.




## అసెంబ్లీపై అనుమానం



ఈ నెల 15 నుంచి ప్రారంభం కావల్సిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై సిఎం రోశయ్యకు అనుమానం పట్టుకుంది. తెలంగాణపై ఏర్పాటైన శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు నచ్చకపోతే అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరిస్తామని జెఎసి పిలుపునిచ్చిన నేపథ్యంలో రోశయ్యకు కంగారు ఎక్కువైంది. 2010 - 2011 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను వచ్చే నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో శాసనసభ ఆమోదించాల్సి వుంది. ఆందోళనల కారణంగా అసెంబ్లీ సమావేశాలు అసలు జరగకపోతే బడ్జెట్‌కు చుక్కెదురవుతుంది. అప్పుడు రాష్ట్రంలో తీవ్ర రాజ్యాంగ సంక్షోభం ఎదురవుతుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా కృష్ణ కమిషన్ విధి విధానాల ప్రకటనను కనీసం మరో పదిరోజులు వాయిదా వేయించడానికి రోశయ్య ప్రయత్నిస్తున్నాడు. అయితే అసెంబ్లీకి ముందే విధివిధానాల ప్రకటన జరగాలని, లేకపోతే సమావేశాల్ని బహిష్కరిస్తామంటూ జెఎసి మెలిక పెట్టింది. ఈ పరిస్థితుల్లో రోశయ్య నిద్రలేని రాత్రుల్ని గడుపుతున్నారట. పాపం! రోశయ్య!!

## 'విస్తరణ' లేనట్లే



అసెంబ్లీ సమావేశాలకు ముందుగానే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వుంటుందని ఆశ పెట్టుకున్న ఎమ్మెల్యేలకు రోశయ్య మొండిచేయి చూపెట్టాడు. అసెంబ్లీకి ముందు 'విస్తరణ' చేస్తే కొత్త సమస్యలు వస్తాయని రోశయ్య వెనకడుగు వేశాడు. విస్తరణకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వున్నా రోశయ్య మాత్రం సాహసించలేకపోతున్నాడు. దీంతో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి వంటివారు రోశయ్యపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. దామోదర్‌రెడ్డి అయితే ప్రత్యక్షంగా రోశయ్యను తిట్టిపోస్తున్నాడు. పాపం! రోశయ్య తన బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలీక రోజులు దొర్లించేస్తున్నాడు.

## మేరా నామ్ 'జానీ'



శాసనమండలి డిప్యూటీ స్పీకర్ మహమ్మద్ జానీ జోలికి వెళ్లి ఎమ్పీ మధుయాష్కీ చేతులు కాల్చుకున్నాడు. సమైక్యాంధ్రపై జానీ స్టేట్‌మెంట్‌ను విమర్శిస్తూ 'ఆయనెవరో జానీ అట' అంటూ సంబోధించాడు. దానికి జానీకి చిర్రెత్తుకొచ్చింది. ముప్పయ్ అయిదేళ్లుగా రాజకీయాల్లో వున్న జానీ తెలీదంటాడా! అంటూ రెచ్చిపోయాడు. 2004లో డబ్బులిచ్చి ఎమ్పీ టిక్కెట్ కొనుక్కొన్న మధుయాష్కీ రాజకీయాల్లో 'పిల్లాడు' అంటూ తేల్చిపారేశాడు. దీంతో ఖంగుతిన్న యాష్కీ ఇదెక్కడి గొడవరా బాబూ? తెలీక ముట్టుకున్నానంటూ తెగబాధపడి పోతున్నాడట. జానీనా! మజాకానా!

## టార్గెట్ కెవిపి



వైఎస్ ఆత్మగా చెప్పుకొనే కెవిపి ఇప్పుడు రాజకీయ టార్గెట్‌గా మారాడు. విపక్షంలోనేగాక స్వపక్షంలో కూడా కెవిపిపై ఆరోపణల పర్వం మొదలైంది. కాంగ్రెస్‌పార్టీకి చెందిన పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, ఆమోస్‌లు కెవిపిపై విమర్శలు గుప్పిస్తుండగా, తెలుగుదేశం నాయకులు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. కెవిపి రాజ్యాంగేతరశక్తిగా చలామణి అవుతూ కోట్లు కొల్లగొడుతున్నాడని, ఆయన అక్రమ సంపాదనపై విచారణ జరిపించాలంటూ తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తున్నది. వైఎస్ ఉండగా కెవిపిపై ఈగ కూడా వాలేది కాదు. రాష్ట్ర ప్రభుత్వం కెవిపి కనుసన్నల్లోనే మెలిగేది. అయినా అప్పుడు కెవిపిని ఒక్క మాట కూడా అననివారు ఇప్పుడు ఆరోపణలతో చెలరేగిపోతున్నారు. కెవిపి కుమారుడు దుబాయ్‌లో అక్రమవ్యాపారాలు చేస్తున్నాడంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించడాన్ని కెవిపి తీవ్రంగా తీసుకున్నాడు. అయిదు పేజీల లేఖను చంద్రబాబుపై సంధించాడు. తనపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు 'బాబు' డైరక్షన్ వుందంటూ తిట్టిన తిట్టు తిట్టకుండా తన లేఖలో 'బాబు'ను ఏకిపారేశాడు.

## రాష్ట్రంపై జయప్రద కన్ను!



సినీనటి, ఎమ్పీ జయప్రద తిరిగి రాష్ట్ర రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తి చూపుతోందట. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ నుంచి ఎమ్పీగా వున్న జయప్రదకు అక్కడ చుక్కెదురవుతోంది. ములాయంసింగ్‌కు ఆప్తుడిగా వున్న అమర్‌సింగ్ ఆ పార్టీ నుంచి బయటకురావడంతో జయప్రద కూడా పార్టీకి దూరం కావాల్సి వచ్చింది. తెలుగుదేశం పార్టీకి దూరమైన తర్వాత జయప్రద ఉత్తరాదికి వెళ్లి అమర్‌సింగ్ అండదండలతో ఎమ్పీ అయ్యింది. ఇప్పుడు అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో తిరిగి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించాలని ప్రయత్నిస్తోందట. చంద్రబాబు అంటే కస్సుమంటున్న జయప్రద ఏ పార్టీ నుంచి పోటీచేస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## గవర్నర్ స్టైలే వేరు



రాష్ట్రంలో ముఖ్యమంత్రికి భయపడనివారు కూడా గవర్నర్ అంటే హడలెత్తిపోతున్నారు. రాష్ట్ర గవర్నర్‌గా నరసింహన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి రాజ్‌భవన్‌కు కొత్త కళ వచ్చింది. ప్రతిరోజూ ఉదయాన్నే 5 గంటలకు గవర్నర్ దినచర్య ప్రారంభమై రాత్రి 10 గంటలదాకా కొనసాగుతుండటంతో రాజ్‌భవన్ వద్ద సందడి సందడిగా వుంటోంది. అయిదు గంటలకు గవర్నర్ స్థానిక గుడి గోపురాల్ని సందర్శించి పూజలు నిర్వహిస్తున్నాడు. ఆ తర్వాత సందర్శకులకు ధర్మ దర్శనం. ఆ పై రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలపై సమీక్ష... ఇలా సాగుతోంది గవర్నర్ కార్యక్రమం. ఇది ఇలా వుండగా యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్ల సమావేశంలో గవర్నర్ చేసిన ప్రసంగం కొరడా ఝులిపించినట్లుంది. 'లౌక్యంగా మాట్లాడటం నాకు తెలీదు. అర్థమయ్యే భాషలో మాట్లాడతా! మాటలు కాదు పని కావాలంటూ' వైస్‌ఛాన్సలర్లను కాస్తంత గట్టిగా మందలించడం చర్చనీయాంశమయ్యింది. అలాగే గాంధీ ఆస్పత్రికి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకోవడం ఆయన నిరాడంబర వ్యక్తిత్వానికి ప్రతీకగా చెప్పుకుంటున్నారు.




ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక



## నిషా దిగిపోయే జరిమానాలు!

వచ్చిన కొత్తల్లో వార్తల్లోని వ్యక్తిగా వుండిన నెల్లూరు నగర డిఎస్పీ రాధిక ఈ మధ్య కాస్త తెర మరుగయ్యారు. విలక్షణంగా డ్యూటీ నిర్వహిస్తే తప్ప వార్తల్లో వుండనని భావించారో ఏమో నెల్లూరు పోలీసులు గత ఏడాదిగా వాడకుండా పెట్టెల్లో పెట్టేసిన బ్రీత్ అనలైజర్లు బయటకు తీసి రోడ్డుపై నడిరేయి నిలబడ్డారు. ద్విచక్ర వాహనదారులను ఆపి గట్టిగా ఊదమని, బ్రీత్ అనలైజర్ ముందు పెట్టారు. దీంతో పనుల తర్వాత మూడు ఔన్సుల మందు స్వీకరించి ఇళ్లకు పోయే మందు బాబులంతా డిఎస్పీ చేతికి చిక్కేశారు. ఆమె ఏ మాత్రం కనికరం చూపకుండా విధించిన జరిమానాకు మందు బాబులకు నిషా దిగిపోయినంత పనయ్యింది పాపం!

## పోలీసుకు లాఠీఛార్జి నేర్పాలా?



చేపపిల్లకు ఈత నేర్పాలా అన్నట్లు పోలీసులకు జనాన్ని ఎలా పీక్కోతినాలో, ఎలా లాఠీఛార్జి చేయాలో, ఎట్లా ఇబ్బందులు పెట్టాలో ఒకరు నేర్పాలా? విషయమేమిటంటే గుంటూరు రేంజ్ ఐజి కిషోర్‌కుమార్ ఈ వారంలో నిర్వహించిన నెల్లూరు పోలీసుల పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్నారు. పోలీసులు ఏ విధంగా కవాతు చేస్తున్నారు. ప్రజలను ప్రమాదాల నుంచి ఎలా కాపాడుతున్నారు, ఆయుధాలు ఎలా వాడుతున్నారన్న అంశాలన్నీ పరిశీలించారు. నెల్లూరు పోలీసులు మహా ముదుర్లు కదా... తమకు లాఠీఛార్జి చేయడం రాదన్నట్లు నటించారు. దీనికి అవాక్కైన ఐజి స్వయంగా లాఠీపట్టి ఎలా లాఠీఛార్జి చేయాలో నేర్పించారు. పనిలో పనిగా బాధ్యతాయుతమైన విధి నిర్వహణతోనే పోలీసువ్యవస్థకు సమాజంలో గుర్తింపు వస్తుందని హితబోధ చేశారు. కాని ఈ బోధ ఎవరి తలకెక్కినట్లు లేదు.

● మహమ్మద్ ప్రవక్త జన్మదినమే

# మిలాడినబి!



మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా వుండే ముస్లింలందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. ఈ పండుగనే మిలాడినబి అంటారు. అరబ్బీ పదం నుంచి వచ్చినది మీలాద్. ఆధ్యాత్మిక గురువులు, ఔలియాల జన్మదినాన్ని మీలాద్‌గా జరుపుకోవడం ఆనవాయితి. ఇస్లామియా క్యాలండర్‌లో 3వ నెల రబీ - ఉల్-అవ్వల్ 12 తేదిన మిలాడినబి వస్తుంది. దేశంలో జరిగే ఉరుసు ఉత్సవాలు ఈ నెలలో జరుగుతాయి. ఇస్లాం ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకొని మౌలిద్ షరీఫ్ (ప్రవక్త జయంతి ఉత్సవాలు) ప్రారంభిస్తారు. ప్రవక్త పరమపదించిన నాలుగు శతాబ్దాల వరకు ఈ జన్మదినోత్సవాలు జరపలేదు. 12వ శతాబ్దపు ఆరంభం నుంచి వీటిని జరుపుకోవడం ప్రారంభించారు. మొదటగా ఈజిప్టులో ఇవి మొదలయ్యాయి. మహమ్మద్ ప్రవక్త కుమార్తె తరపున వారు ఈ జయంతి ఉత్సవాలు జరపడం ఆరంభించారు. సూఫీ పద్ధతులకు అనుగుణంగా వుండే ఖలీఫా, ఇతర సాంప్రదాయాల ప్రకారం ఈ కార్యక్రమం జరుగుతుంది. తర్వాతి కాలంలో మిలాడినబి పండుగ ప్రపంచమంతా విస్తరించింది. ఆనాటి నుంచి ప్రవక్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకొంటున్నారు. పండుగనాడు మసీదులను, మీలాద్ జరిగే ప్రదేశాలను సాంప్రదాయంగా అలంకరిస్తారు. ఆరోజున భక్తులకు మహమ్మద్ ప్రవక్త బోధనలను, ఆయన ప్రాశస్త్యాన్ని, జీవనగాధ, జీవనశైలిని విపులంగా చెప్తారు. దైవ మార్గంలో ధనాన్ని, ఇతర వస్తువులను ఖర్చు చేస్తారు. పిండి వంటలను తయారు చేసి పంచిపెడతారు. ప్రపంచ వ్యాప్తంగా వుండే ముస్లింలందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకొంటారు.

## ప్రసన్న 'చిరు' భజన



నల్లపరెడ్డి కుటుంబ రాజకీయవారసుడు ప్రసన్న కుమార్‌రెడ్డి అనుసరిస్తున్న రాజకీయ శైలి ఎవరికీ అంతుబట్టలేదు. కోవూరు నుంచి తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందిన ఆయన అకస్మాత్తుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డిని కీర్తిస్తూ కాంగ్రెస్‌పార్టీ వైపు వెళ్లిపోయారు. ఆయన మరణించాక దిక్కు తోచని స్థితిలో వుంటూ కాంగ్రెస్ పార్టీలోని జిల్లా నాయకులు నేదురుమల్లి జనార్ధనరెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి గడపలు కూడా తొక్కారు. ప్రయోజనం లేదనుకొన్నారో ఏమో... ఈవారం తన నియోజకవర్గ పర్యటనలో ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు చిరంజీవిని తెగపొగిడారాయన. సమైక్యాంధ్రకు 'జై' అన్న మెగాస్టార్ ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందేనన్నారు. ప్రసన్న మళ్లీ మాట మార్చిన వ్యవహారాన్ని ఆయన కుటుంబ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## చింతా తిరకాసు



రాష్ట్రంలోనే విలక్షణ పార్లమెంటు సభ్యుడు చింతా మోహన్. తిరుపతి స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన ఎప్పుడూ జనానికి అందుబాటులో వుండేవారు కాదు. అటువంటిది ఇప్పుడు తన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనికి వచ్చే నెల్లూరు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ మధ్య విస్తృతంగా పర్యటిస్తున్నారు. స్వతహాగా డాక్టర్ అయిన చింతా ఈవారం నాయుడుపేట గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్లి అక్కడి డాక్టర్లు, సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. సమాధానాలు చెప్పని వారిని సస్పెన్షన్ కావాలో? ట్రాన్స్‌ఫర్ కావాలో తేల్చుకోమన్నారు. ప్రజలకు అందుబాటులో వుండని వైద్యులను ఉపేక్షించేదిలేదని ఎమ్పీ కాస్త గట్టిగా చెప్పడంతో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మొఖాలు మాడిపోయాయి.





## శుభాభినందనలు



సి.అర్.ఎమ్ ఐ.టి. సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు
(C.R.M. I.T. SOLUTIONS PVT. LTD., Bangalore - 68) సాఫ్టువేరు కంపెనీ
సెప్టెంబరు 2003న, మైపాడు వాస్తవ్యులు శ్రీ నారపరెడ్డి కోదండరామిరెడ్డి - సులోచనమ్మ గార్ల
కుమారుడు శ్రీ నారపరెడ్డి వినోద్‌రెడ్డి చే ప్రారంభించబడిన సంస్థ.
వారు దశాబ్ద కాలం పాటు అమెరికాలోని వివిధ సంస్థలలో పనిచేసి అనుభవం గడించి
జన్మభూమిపై ఉండే మమకారంతో తిరిగి ఇండియా వచ్చి ఈ సంస్థను
ప్రారంభించారు. గత 6 సంవత్సరాలుగా గణనీయమైన పురోభివృద్ధితో 120మంది
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో ఆ సంస్థ దినదిన ప్రవర్ధమానమవుతుంది.

వ్యాపారాభివృద్ధిలో భాగంగా ఈ నెల 19వ తేదీ ఆ సంస్థ 6వ వార్షికోత్సవ సందర్భంగా విశాలమైన **కొత్త భవనం**లోకి మార్చిన సందర్భంగా హితులకు, సన్నిహితులకు, శ్రేయోభిలాషులకు, ఖాతాదారులకు విందు ఏర్పాటు చేశారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులందరికీ బోనస్‌లు, ఇంక్రిమెంట్లు కూడా ప్రకటించారు. ఉత్తరకర్నాటకలో వరద ముంపుకు గురైన బాధితులకు 1.5లక్షల రూపాయలు విరాళంగా కర్నాటక ముఖ్యమంత్రి నిధికి పంపించారు. శ్రీ వినోద్‌రెడ్డి సాంకేతిక సారధ్యంలో ఈ సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనసారా ఆకాంక్షిస్తూ.. ఆ దేవుని ప్రార్థిస్తూ.. శుభాభినందనలతో...

డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి　　పూండ్ల వెంకురెడ్డి

# పేరుగొప్ప బుచ్చి పంచాయితీ దిబ్బ!

జిల్లాలో అతిపెద్ద మేజర్ గ్రామ పంచాయితీగా పేరొందిన బుచ్చిరెడ్డి పాళెం చెత్త, చెదారాలు పేరుకపోయి కంపు కొడుతున్నది. గ్రామంలో అత్యంత ప్రధానమైన ముంబాయి - నెల్లూరు జాతీయరహదారిపై పడి వున్న చెత్తను రోజుల తరబడి తొలగించకపోవడం వలన గాలికి లేస్తూ ఇళ్లపై పడుతున్నది. పంచాయితీ అభివృద్ధికి ఇతోధికంగా నిధులు వస్తున్నా, పాలకవర్గం, సంబంధిత అధికారులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వున్నాయి. గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజలు కనీస సదుపాయాలు లేక ఇక్కట్లు పడుతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది.

బుచ్చిరెడ్డిపాళెం పంచాయితీ పరిధిలో 25వేల జనాభా, 6వేల కుటుంబాలు, 20వేల మంది ఓటర్లున్నారు. ఈ పంచాయితీకి 12వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సి నిధులు దాదాపు 9లక్షల రూపాయలు మంజూరవుతాయి. ఇవే కాకుండా పన్నుల రూపంలో మరో 3 లక్షల రూపాయలు వసూలు చేస్తుంటారు. 20 వార్డులు కలిగిన ఈ గ్రామపంచాయితీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన మేనకూరు స్వర్ణమ్మ సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పంచాయితీ పరిధిలో రాఘవరెడ్డి కాలనీ, రామకృష్ణానగర్, గాంధీనగర్, రెండు దళిత కాలనీలు, సుహాసిని నగర్, పాతరాచపాళెం తదితర ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాలన్నింటిలో పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా వుంది. బుచ్చి నుంచి ఆత్మకూరు వైపు వెళ్లే జాతీయ రహదారి ప్రక్కన డ్రైనేజీ కాల్వల ఏర్పాటు చేయడం జరిగింది. డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేసిన అధికారులు వీటిని ఎక్కడ కలపాలో తెలియక అలాగే వదిలేశారు. దీంతో డ్రైనేజీ కాల్వల్లోకి చేరిన మురికి నీరు బయటకు వెళ్లే దారిలేక నిలబడిపోతున్నది. కొద్దిపాటి వర్షం వచ్చినా డ్రైనేజీ కాల్వలు పొంగి ప్రక్కనే వున్న షాపులు, గృహాల్లోకి చేరుతుందని స్థానికులు వాపోతున్నారు. అలాగే బుచ్చి నుంచి తురిమెర్ల వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా వున్న డ్రైనేజీ కాల్వల్లో మురికి నీరు నిల్వ వుండడంతో పందులు చేరి స్వైర విహారం చేస్తున్నాయి. ఊరికి శివారులో వున్న దళిత కాలనీల్లో అంతర్గత రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ ఏనాడు కూడా పంచాయితీ పరిధిలోని కాలనీల్లో పర్యటించి సమస్యల గురించి తెలుసుకున్న దాఖలాల్లేవని అంటున్నారు.

త్రాగునీటి సరఫరా కొంతమేర బాగున్నా రాత్రి సమయంలో కొన్ని వీధుల్లో లైట్లు వెలగక పోవడంతో చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయని మహిళలు చెప్పారు. ఈ క్రమంలో పంచాయితీలోని సమస్యలు అభివృద్ధి గురించి స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కన ఇస్తున్నాం.



### పూడిక తీతకు ప్రతిపాదనలు!

పంచాయితీ పరిధిలోని డ్రైనేజీ కాల్వలో పూడిక తీసేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయడం జరుగుతుంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అంతర్గత రోడ్లను నిర్మించేందుకు కృషి చేస్తాం.

- పెంచల శ్యాం, పంచాయితీ కార్యదర్శి.



### డ్రైనేజి కాల్వలతో ఇక్కట్లు!

జాతీయ రహదారి ప్రక్కన డ్రైనేజి కాల్వలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే మురికి నీటిని ఎక్కడికి పంపాలో తెలియని అధికారులు అలాగే వదిలేయడం వల్ల దుర్గంధభరితంగా తయారయ్యి దోమలు, పందులు చేరడంతో లేనిపోని వ్యాధులు ఎక్కడ విజృంభిస్తాయోనని ఆందోళన చెందుతున్నాం.

- సిహెచ్.జోసఫ్



దుస్థితిలో డ్రైనేజి వ్యవస్థ.



రోడ్డు ప్రక్కన పేరుకపోయిన చెత్త.

**అవినీతి కథ**

# గాదెక్రింద పందికొక్కుల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు!

నెల్లూరు నగర పరిధిలో గత మూడునెలల నుంచి విషజ్వరాలు, చికున్‌గున్యా జ్వరాలు వ్యాపించి ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడం, త్రాగునీరు కలుషితం కావడం, నగరంలోని పలు హోటళ్లలో విక్రయించే నాసిరకం ఆహార పదార్థాలు కొని తినడం వల్ల కూడా వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆహారపదార్థాలు విక్రయించే హోటళ్లు, చేపలు, మాంసం విక్రయించే దుకాణాలపై నిత్యం తనిఖీలు, పర్యవేక్షణ చేయాల్సిన ఫుడ్‌ఇన్స్‌పెక్టర్లు మామూళ్ల మత్తులో జోగుతూ ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం మానేశారు.

మునిసిపల్ కార్పొరేషన్‌లో శానిటరి ఇన్స్‌పెక్టర్లుగా కొనసాగుతున్న వారే ఫుడ్ఇన్స్‌పెక్టర్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు హోటళ్లలో విక్రయించే ఆహార పదార్థాలు అత్యంత నాసిరకంగా వుంటున్నాయి. నాసిరకంగా వున్న పదార్థాలను సైతం అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు నిర్వాహకులు. నెల్లూరు నగర మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 14 శానిటరి ఇన్స్‌పెక్టర్ల డివిజన్లు వున్నాయి. ఈ డివిజన్ల పరిధిలో పారిశుధ్యం విధులు నిర్వహించే శానిటరి ఇన్స్‌పెక్టర్లు 14 డివిజన్లను 9 డివిజన్లుగా ఏర్పాటుచేసుకొని నగరంలో వున్న అన్ని హోటళ్లు, దుకాణాలను నిత్యం తనిఖీలు, పర్యవేక్షణ చేసే విధంగా బాధ్యతలు అప్పగించారు కార్పొరేషన్ అధికారులు.

ఆహార పదార్థాల తనిఖీ, నాణ్యత ప్రమాణాల మెరుగు కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నుంచి డిప్యుటేషన్‌పై వైద్యాధికారిని నియమించి వున్నారు. ఈ వైద్యాధికారినే మునిసిపల్ హెల్త్‌ఆఫీసర్‌గా పిలుస్తుంటారు. ఈయన పర్యవేక్షణలోనే నగరంలోని శానిటరి ఇన్స్‌పెక్టర్లు విధులు నిర్వహించాల్సి వుంటుంది. శానిటరి ఇన్స్‌పెక్టర్లు వారి పరిధిలో వున్న హోటళ్లతోపాటు, కిరాణా దుకాణాల్లో విక్రయించే సరుకులను సైతం శాంపిల్స్ సేకరించి నాణ్యతగా వున్నాయా? లేదా అని పరిశీలించాలి. అయితే ఇటువంటి పనులు చేపట్టకుండా ప్రతి నెల మామూళ్లను దండుకొంటూ నియంత్రణను గాలికొదిలేస్తున్నారు. శానిటరి ఇన్స్‌పెక్టర్ల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా అంటువ్యాధులు వ్యాపించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

**నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు తమ పనిని ఎప్పుడో మర్చిపోయారు. నెలనెలా మామూళ్లు తెచ్చుకోవడానికే పరిమితమవుతున్నారు.**

ఇకపోతే చేపలు, మాంసం విక్రయిస్తున్న మార్కెట్లు అక్కడి దుకాణాల గురించి అసలు పట్టించుకోరు. ఈ మార్కెట్లోని దుకాణదారుల నుంచి మామూళ్లు వసూలు చేయడంతో పాటు అధికారులకు అవసరమైన చేపలు, మాంసాన్ని ఉచితంగా తీసుకెళ్తుంటారు. పెద్ద హోటళ్ల గురించి చెప్పనవసరం లేదు. శానిటరి ఇన్స్‌పెక్టర్లు కనీసం ఈ హోటళ్ల వంటగదిలోకి ప్రవేశించలేని పరిస్థితి. పారిశుద్ధ్యం, ఆహార పదార్థాల నాణ్యతాప్రమాణాలు సరిగా లేకున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయారు. నాణ్యతాప్రమాణాలు, పారిశుద్ధ్యం పాటించని దుకాణాలకు అపరాధ రుసుం విధించడంతోపాటు మరోసారి నిబంధనలను పాటించకుంటే లైసెన్స్‌ను కూడా రద్దు చేసే అవకాశం వుంటుంది. అసలు అధికారులే నిబంధనల ప్రకారం పని చేయడం లేదు.



కుంభకోణాలకు కేంద్ర స్థానం నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం.

శానిటరి ఇన్స్‌పెక్టర్ల పనితీరును పర్యవేక్షణ చేయాల్సిన హెల్త్ ఆఫీసర్ ప్రతి నెల మామూళ్లు తీసుకొని ఏ విషయాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. కార్పొరేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా బదిలీ కాకుండా ఇక్కడే పని చేస్తున్న శానిటరి ఇన్స్‌పెక్టర్లు మామూళ్ల వసూలు చేసే విషయంలో బాగా ఆరితేరిపోయి వున్నారు. నగరంలో పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా వుందంటూ కొందరూ కార్పొరేటర్లు, నగర వాసులు ఎంత మొత్తుకున్నా స్పందించే దిక్కు లేకుండా పోవడం విశేషం.

## కొత్తా... పాత పట్టింపులేదు!

షూటింగ్ సమయంనే సెట్‌కు వస్తా. మీడియాతో మాట్లాడను. పత్రికలకు ఇంటర్వ్యూలివ్వమని నన్ను కోరకూడదు. సినిమా ప్రచారానికి రానని ఖరాఖండిగా సినిమా ప్రారంభానికి ముందే అగ్రిమెంట్‌లో వ్రాసిచ్చే నటిగా పేరు గాంచింది నయనతార. ఇన్ని ఆంక్షలు పెట్టే ఆమె కొత్త నటులతో నటించనని మాత్రం చెప్పదు. ఈ విషయమై మాట్లాడుతూ నాకు కొత్తాపాతా తారతమ్యాలు లేవు. ఎదుట నిలచిన వ్యక్తి ఎవరైతే ఏముంది? మన పాత్రలో మనం చేస్తున్నామన్నదే ముఖ్యం. ఇవాల్టి అగ్ర నాయకులందరూ ఒకప్పుడు కొత్తవారే. నేను పరిశ్రమలో అడుగుపెట్టిన కొత్తలో రజనీకాంత్ గారి దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకొన్నాను. అనుభవజ్ఞులతో పని చేసేటప్పుడు నటనను మెరుగుపర్చుకోవచ్చు. కొత్త వారితో చేస్తున్నప్పుడు వారు చేస్తున్న తప్పులను మనం చేయకుండా వుండవచ్చంటుంది ఈ మలబారు భామ.



## నేహా పెదవులకు పని!



చిరుత సినిమాలో రామ్‌చరణ్‌తేజ సరసన హీరోయిన్‌గా నటించి అందరిని అలరించిన హీరోయిన్ నేహాశర్మ ఈ చిత్రం తర్వాత ఆమె ఎందువల్లో తెలుగు చిత్రాల్లో నటించలేదు. నటించిన ఒక్క చిత్రం 'కుర్రాడు' ఆమె కెరీర్‌కు వుపయోగపడలేదు. నేహాశర్మ ప్రస్తుతం బాలీవుడ్ చిత్రం 'క్రూక్'లో నటిస్తుంది. హీరో ముద్దుల వీరుడుగా పేరు గాంచిన ఇమ్రాన్‌హష్మి ఆయన సరసన నటించిన ఏ నాయికనైనా సరే ముద్దుపెట్టకుండా వదలడు. ఈ విషయాన్ని దర్శకుడు మోహిత్ సూరి ధృవీకరించాడు. ఇమ్రాన్ హీరో అంటే ప్రేక్షకులు ఏం ఊహించుకొంటారో అవన్నీ మా సినిమాలో వున్నాయి. నేహా తన పెదవులకు పని పెట్టక తప్పదేమోనని చమత్కరించారాయన. ఈ సినిమాతో నైనా బాలీవుడ్‌లో తాను నిలదొక్కుకోగలనన్న ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తం చేసింది నేహా.

## మంచి పాత్రల కోసం చూస్తున్నా!

తమిళ చిత్రాల షూటింగుల్లో పాల్గొనను హైదరాబాద్ లోని ఫిల్మ్‌సిటీకి అందాలతార శ్రియ నెలకొకసారైన వస్తుంది. షూటింగ్ గ్యాప్‌లో ఆమెను తెలుగు చిత్రాల్లో ఎందుకు నటించడం లేదంటే...నేను ద్విభాషా చిత్రాల్లో నటిస్తూ తెలుగు వారికి కూడా దగ్గర గానే వున్నా. పిస్తా, మల్లన్న వంటి చిత్రాలు తెలుగులోనూ విడుదలయ్యాయి. కాకపోతే ప్రత్యక్షంగా తెలుగులో నటించాలంటే స్క్రిప్ట్, నా పాత్ర, కనీసం ప్రాజెక్టుపరంగానైనా భారీతనం, ప్రత్యేక గుర్తింపు వుండాలి. మంచి పాత్ర కోసమే ఎదురు చూస్తున్నాను. ఎవరైనా అటువంటి ప్రాజెక్ట్‌తో ముందుకొస్తే నటించడానికి సిద్ధమంటుంది శ్రియ.





## అవార్డు ఊహించలేదు!

సహజంగా హీరోయిన్‌కు నటనలో జాతీయ అవార్డు రావాలంటే ఆమె పోషించే పాత్రలో అసలు అందంగా కనిపించకూడదు. మేకప్‌కు దూరంగా వుండాలన్నది భ్రమే అని నిరూపించింది ఈసారి జాతీయ ఉత్తమనటి పురస్కారం పొందిన ప్రియాంక చోప్రా. ఫ్యాషన్ చిత్రంలో ఆమె పోషించిన అందమైన పాత్రకు అవార్డు రావడం పట్ల చాలా సంతోషంగా వుంది. ఈ విషయమై మాట్లాడుతూ అవార్డును కలలో కూడా ఊహించలేదు. దర్శకుడు మధుర్ భండార్కర్ ఈ కథ చెప్పినప్పుడు నా పాత్ర కష్టమని భయపడ్డాను. కాని ఇప్పుడాపాత్రే మరచిపోలేని గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చింది. జాతీయ అవార్డుతో నా పాత్రకు పరిపూర్ణత లభించింది. దేవుడి దయ కూడా ఈ పురస్కారం వచ్చేందుకు సహకరించిందని వినమ్రంగా చెప్పింది ప్రియాంకా.

## విలక్షణంగా యుగానికి ఒక్కడు!

అల్లూరు రహీం

గత ఏడాది తెలుగులో విడుదలైన సోషియో ఫాంటసీ చిత్రాలు అరుంధతి, మగధీర సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. తెలుగు దర్శకులు, నిర్మాతలు, నటులు, సాంకేతిక నిపుణుల స్థాయిని ఈ రెండు చిత్రాలు జాతీయస్థాయిలో తెలియజెప్పాయి. తెలుగులో ఇంతకు మునుపు 7/జి-బృందావన కాలనీ, ఆడవారి మాటలకు అర్థాలేవేరులే చిత్రాలను తీసిన దర్శకుడు శ్రీరాఘవ ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యేలా తీసిన ద్విభాషా చిత్రమే యుగానికి ఒక్కడు.



ఈ చిత్రం చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఊహాలోకాల్లో విహరిస్తారు. అబ్బురపడతారు. దక్షిణాది దర్శకులకు తగినంత బడ్జెట్ సమకూరిస్తే ఇంగ్లీషు చిత్రాలను తలదన్నేలా ఫాంటసీ, అడ్వెంచర్ చిత్రాలను తీయగలరని యుగానికి ఒక్కడు చిత్రం నిరూపించింది. 12వ శతాబ్దంనాటి చోళ పాండ్య పాలకుల మధ్య రేగిన వైరం ఈ చిత్రం నడతకు ఆధారమైనా దీనికి సంబంధం చుడుతూ దర్శకుడు సృష్టించిన సన్నివేశాలు చూస్తే నోరెళ్లబెట్టక తప్పదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమెజాన్ అడవులు, ఎత్తైన జలపాతాలు, మలేషియాలోని దీవులు, నౌకాశ్రయాలు, వెన్నెల్లో సముద్రయానం చూడను రెండు కళ్లు చాలవు. అదే విధంగా అడవి మనుషులు, సైన్యం మధ్య పోరాటం, సముద్రంలో వింతజీవులు, ఒక్కసారిగా వెండితెరపై వేలాదిగా జర జర ప్రాకే పాములు, ఇసుకలో అగాధాలు, పురాతన నగరాలు, రోమాంచిత పోరాటాలు సినిమా చూస్తున్న ప్రేక్షకులను గగుర్పాటుకు గురిచేస్తాయి. రెండు వేల మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు, 20 హెలికాప్టర్లతో సన్నివేశాల చిత్రీకరణకు నిర్మాత రవీంద్రన్ చెప్పినట్లు 40 కోట్ల రూపాయలు సరిపోతాయా అనే సందేహం కలగక మానదు. ఎన్నో అబ్బురాలు వున్న ఈ చిత్రానికి కళాదర్శకుడు సంతానం, కెమెరామెన్ రాజీ, సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్‌కుమార్ ప్రాణం పోశారనాలి. యార్, రుద్రవీణ వంటి సంగీత వాయిద్యాలతో న్యూయార్క్‌లో జి.వి.ప్రకాష్‌కుమార్ రీరికార్డింగ్ చేసిన తీరు అద్భుతం. అడవులే కాదు, ఎడారులు, కొండా కోనల్లోని అందాలతోపాటు కొంగ్రొత్త లోకాన్ని చూపిన కెమెరామెన్ రాజీ ప్రతిభను పొగడాల్సిందే. 12వ శతాబ్దం నాటి రాజ్యాన్ని సృష్టించిన కళాదర్శకుడు సంతానం అభినందనీయుడు. యిన్ని అద్భుతాలున్న ఈ చిత్రంలో మాస్ ప్రేక్షకుల కోసం కథానాయికలు రీమాసేన్, ఆండ్రియా చేత దర్శకుడు చేయించిన దేహ ప్రదర్శనకు విస్తుపోవాల్సిందే. చిత్రంలోని రెండు పాటలు ఓం ఈశా సర్వేశా... ఇది కలల సీమరా చిత్రీకరణ మామూలు పాటలకు భిన్నంగా వుంది. ఈ సినిమాలో లోపమని చెప్పుకోవాల్సింది శ్రీరామకృష్ణ సరిగ్గా మాటలు వ్రాయలేక పోవడం. 12వ శతాబ్దం నాటి మాటలనిపించాలని ఈ పేలుడిచ్చిన దాని పేరేమి? అంటూ పలికించిన గ్రాంధికాలు జనానికి అర్థమై చావవు. ద్వితీయార్థంలో స్క్రీన్‌ప్లే కాస్త బలహీనమైనా సన్నివేశాల అద్భుత లోకంలోకి వెళ్లిన ప్రేక్షకుడు ఇవన్నీ పట్టించుకోడనాలి.

ఇక చిత్రకథలోనికి వెళ్తే 1279 ప్రాంతంలో అదృశ్యమైపోయిన చోళరాజుల అన్వేషణకు బయలుదేరిన ఓ చారిత్రక పరిశోధకుడు కనపడకుండా పోతాడు. ఈ సమయంలోనే కేంద్ర మంత్రి వీరపాండ్యన్ ఆదేశం మేరకు మిలటరీ అధికారి అనిత(రీమాసేన్) నేతృత్వంలో ఓ బృందం అన్వేషణకు బయలుదేరుతుంది. ఈ బృందంలో మెరికల్లాంటి మిలటరీ యోధులతోపాటు చారిత్రక పరిశోధకుడి కుమార్తె(ఆండ్రియా), నౌకాశ్రయంలోని కూలీల నాయకుడు ముత్తు(కార్తీ) కూడా వుంటారు. ఈ బృందం నౌకలో బయలు దేరింది మొదలు పలు అద్భుతాలు జరుగుతాయి. దారిలోనే సగం మంది విగతజీవులవుతారు. కీకారణ్యం, జలపాతాలు, ఎడారులు, కొండలు దాటుకొని రీమాసేన్, ఆండ్రియా, కార్తీ చోళుల రహస్య జీవితం గడుపుతున్న ప్రాంతానికి చేరుతారు. అక్కడ నుంచి కథ ఫాంటసీలోనికి జారుతుంది. రీమాసేన్ పుట్టుక రీత్యా పాండ్య వంశస్థురాలు. తమ కులదేవత విగ్రహాన్ని తస్కరించిన చోళులపై పగ తీర్చుకోనేందుకే ఈ పరిశోధనకు బయలు దేరుతుంది. పాండ్యరాజు(పార్తీబన్)ను తన అందాలతో కవ్వించి మోసగిస్తుంది. వాస్తవానికి పుట్టుకరీత్యా కార్తీ చోళుడు. గత జన్మస్మృతులు వెంటాడి అతను రీమాసేన్‌ను, ఆమె తీసుకొచ్చే మిలట్రీని ఎదుర్కొంటాడు. అంతిమంగా చోళుల వారసత్వాన్ని కాపాడడంతో చిత్రం ముగుస్తుంది.

# ఫెయిల్యూర్ బాటలో సక్సెస్ స్కూళ్లు!

## ఆశించిన ఫలితాలు లేవు.

ప్రభుత్వం తీసుకొనే అనాలోచిత నిర్ణయాలు, అధికారుల వైఫల్యం కారణంగా విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి సక్సెస్ స్కూళ్ల వలన ఏర్పడుతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సక్సెస్ పేరుతో పాఠశాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో ఆంగ్లం పట్ల వున్న మోజును దృష్టిలో వుంచుకొని 2008-09లో సక్సెస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. జిల్లావ్యాప్తంగా 278 స్కూళ్లను సక్సెస్ పథకం క్రింద తీసుకొని వచ్చారు. అన్ని వసతులు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం, విద్యార్థులకు బోధించేందుకుగాను ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. అయితే ప్రభుత్వం ఆశించినంతగా ఫలితాలు రాలేదు. ఆరవ తరగతి నుంచి అందుబాటులోకి వచ్చే సక్సెస్ స్కూళ్లలో చేరే విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సెంట్రల్ సిలబస్‌లో వుండే విద్యావిధానం వలన విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో పునరాలోచనలో పడిన ప్రభుత్వం పలువురితో చర్చించి ఇంగ్లీషు మీడియం స్థానంలో తెలుగు మీడియం ప్రవేశపెట్టడం, సిబిఎస్ఇకి బదులు స్టేట్ సిలబస్‌లోనే పాఠశాల బోధన వుండేలా మార్పులు చేసింది. ఈ మార్పులు చేర్పులతో సిబిఎస్ఇ విధానంలో ముద్రించిన పుస్తకాలు, ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ తదితర కార్యక్రమాల వలన కోట్లాదిరూపాయల ప్రజాధనం వృధా అయిన మాట వాస్తవం.

# ఎసి స్టేడియంలో సౌకర్యాల లేమి!

● అల్లాడుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు.



దుస్థితికి అద్దం పడుతున్న మరుగుదొడ్లు.

నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో సౌకర్యాలు అధ్వాన్నంగా వుండడంతో క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. వీరి కోసం ఏర్పాటుచేసి వుండే హాస్టల్‌లోనూ ఇదే పరిస్థితి. అపరిశుభ్రతకు చిరునామాగా వుండే టాయిలెట్లను వినియోగించుకోలేక బాలికలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శుభ్ర పరచని టాయిలెట్లు, చెడిపోయిన కొళాయిలు, మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్టేడియంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీనికితోడు ప్లేగ్రౌండు గుంటలు మిట్టలుగా వుండడంతో క్రీడాకారులు ప్రాక్టీసు చేసే సమయంలో అవస్థలు పడుతున్నారు. పేరుకు మాత్రం స్టేడియంలో సకల సౌకర్యాలని చెప్తుతున్నా తొంగి చూస్తే మాత్రం అడుగడుగునా నిర్లక్ష్యం, క్షీణించిన పారిశుధ్యం కన్పిస్తుంది. రాష్ట్రస్థాయి పోటీలు, జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లా పేరు ప్రతిష్టలు దేశ స్థాయిలో ఇనుమడింపజేస్తున్నామని చెప్పుకొనే జిల్లా క్రీడాధికారులు, కోచ్‌లకు స్టేడియంలో కరువైన వసతి సౌకర్యాలు కన్పించకపోవడం విచిత్రం.

# దెబ్బతిన్న సంతపేట మార్కెట్!



పైకప్పు పూర్తిగా దెబ్బతిన్న మార్కెట్ గది.

ఒకనాడు కళకళలాడిన సంతపేట చేపలమార్కెట్ కూలిపోయేందుకు సిద్ధంగా వున్న షెడ్లు, క్షీణించిన పారిశుధ్యంతో నేడు దీనస్థితికి చేరుకొంది. దశాబ్దాల క్రిందట ఈ మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. చేపలు, మాంసం, కూరగాయలు, కుండలతోపాటు పాత దుస్తులు అమ్మే అంగళ్లు వున్నాయి. మొత్తం వ్యాపారుల కోసం వంద అంగళ్లను ఏర్పాటు చేశారు. రోజురోజుకు అభివృద్ధి చెందాల్సిన ఈ మార్కెట్ కాస్త క్షీణిస్తూ నేడు శిధిలావస్థకు చేరుకొంది. పాడుపడిపోయి కూలిపోయేలా వుండడంతో కొనుగోలుదార్లు రావడం తగ్గిపోయింది. దీంతో ఒకప్పుడు కళకళలాడిన మార్కెట్ ఇప్పుడు కాస్త వెలవెలపోతూ అపరిశుభ్రతకు, చెత్తచెదారాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ప్రస్తుతం కేవలం పదుల సంఖ్యలో అంగళ్లు వున్నాయి. అవి అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని దీనిపైన ఆధారపడి వున్న వ్యాపారులు బావురుమంటున్నారు. పురపాలక మంత్రి రామనారాయణరెడ్డి నివాసానికి అతి సమీపంలో వుండే ఈ మార్కెట్‌ను తిరిగి అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, పురపాలక అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహిస్తున్నారు.

○ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు స్వాంతన

# పెద్దాసుపత్రిలో డయాలసిస్ యూనిట్



యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మోపిదేవి వెంకటరమణ. ప్రక్కన మంత్రి రామనారాయణరెడ్డి, కలెక్టర్ రాంగోపాల్, రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి.

నెల్లూరు పెద్దాస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ 6వ తేదిన దీనికి రిబ్బన్ కట్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇక్కడ డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ రాంగోపాల్, జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన కృషి ఫలితం కారణంగా డయాలసిస్ యూనిట్ ఏర్పాటు జరిగింది. ఇక నుంచి కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెద్దాస్పత్రిలో డయాలసిస్ చేయించుకోవచ్చు.

ఇప్పటివరకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు బొల్లినేని, నారాయణ వైద్యశాలల్లో మాత్రమే అధిక ఫీజులు చెల్లించి డయాలసిస్ చేయించుకునేవారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేస్తారు. యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంపిక చేసిన రోగులకే కాకుండా ఇతర రోగులకు కూడా ఇక్కడ సేవలందించాలని డాక్టర్లకు సూచించారు. ఆరంభశూరత్వమన్నట్లు కాకుండా ఈ డయాలసిస్ కేంద్రాన్ని సక్రమంగా నడిపే బాధ్యతలను నెల్లూరు పెద్దాస్పత్రి డాక్టర్లు స్వీకరించాలి.

# చిట్‌ఫండ్ కంపెనీల దాదాగిరి!

## భయభ్రాంతులవుతున్న ఖాతాదారులు

ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్ సంస్థలు ఖాతాదారులపై దాదాగిరి చేయడం, దౌర్జన్యాలకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ఘటనలు నగరంలో ఎక్కువయ్యాయి. ఆకర్షణీయమైన ప్రకటనలతో ఖాతాదారులను ఆకట్టుకొంటున్న ఒక చిట్‌ఫండ్ కంపెనీ ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడదంతో జనం ఆందోళన చెందుతున్నారు. మూలపేటకు చెందిన ఒక వ్యాపారి ఈ చిట్‌ఫండ్ కంపెనీలో చిట్ కట్టాడు. ఆక్షన్‌లో అతనికి సంబంధించిన, ఇవ్వాల్సిన మొత్తాన్ని అందజేయకుండా కొంత తమ వద్ద పెట్టుకొని, దానితో భూములుకొన్నామని చెప్పడంతో ఆ ఖాతాదారుడు ఆశ్చర్యపోయాడు. ఎక్కడ, ఎంతమేర, ఎంతవిలువకు భూమి తన పేర కొనుగోలు చేశారో వివరాలు చెప్పకపోవడంతో ఆయన నెలసరి వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఆ చిట్‌ఫండ్ కంపెనీ పదిమంది గూండాలను అతనికి గ్యారంటార్‌గా వున్న మహిళ మీదకు పంపడంతో వారు హడలిపోయారు. చుట్టుప్రక్కలవాళ్లు అడ్డుకోవడంతో ఈ రౌడీలు వెనుదిరిగారట. సాధారణంగా ఎవరైనా సొమ్ము చెల్లించనప్పుడు గ్యారంటర్ వద్ద నుంచి లీగల్‌గా చర్యలు చేపట్టాల్సి వుంది. అలాకాకుండా రౌడీలను, గూండాలను పెంచిపోషిస్తూ వారితో ఇళ్ల మీదకు దాడులు చేయించడం నగరంలో పరిపాటయ్యింది. వాహనాలకు ఫైనాన్స్ చేసే కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు ఇలాంటి దౌర్జన్యాలకు దిగుతున్నా పోలీసులు గమ్మునుండడం విమర్శకులకు తావిస్తోంది.

# ఇన్‌ఛార్జ్ మంత్రిని కలిసిన రాజీవ్‌భవన్ నేతలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణను నగరంలోని రాజీవ్ భవన్ నేతలు కలసి నగరంలోని పారిశుధ్యం, దోమల బెడదల గూర్చి వివరించారు. నగరంలో పారిశుధ్యం లోపించి నగర ప్రజలు రోగాల బారిన పడుతున్నా కార్పొరేషన్ పాలకవర్గం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు సంబంధించి రాజీవ్‌భవన్ ఆధ్వర్యంలో ఫాగింగ్ మిషన్లను 30లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు ఎవరు కూడా ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## గవర్నర్

మొదటి పేజీ కొరవ

ఆయన చేయవలసిన పని. ఇఎస్ఎల్.నరసింహన్ అందుకు విరుద్ధంగా తన ప్రసంగానికి తానే బాధ్యుడినన్న తీరులో అధికారులతో చర్చలు జరపడం ముఖ్యమంత్రికి తల కొట్టేసినంత ఇబ్బందిగా వుంది. కానీ ఏమీ చేయలేక పోతున్నాడు. వైఎస్, చంద్రబాబు వంటి దిట్టమైన ముఖ్యమంత్రులు వుంటే గవర్నర్లు ఇట్లా తోక జాడించలేరు. ఇప్పుడున్నది రోశయ్య కాబట్టి నరసింహన్‌కు ఆట విడుపుగా వుంది.

రానున్న కొద్దివారాలలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తప్పదు కాబట్టి, అప్పుడు అన్ని పాలనా వ్యవహారాలు తానే చక్కబెట్టాలి కాబట్టి, ఇప్పటి నుంచే అందుకు సిద్ధమౌతున్నట్లుగా వుంది నరసింహన్ ధోరణి. అది ముఖ్యమంత్రికే కాక, అధికారులకు కూడా ఇష్టపడడం లేదు. కానీ నరసింహన్ వ్యక్తిత్వం ఉన్నతమైనది కావడం, ఆయనకు కేంద్రం మద్దతు పూర్తిగా వుండడంతో ఎవరూ నోరు విప్పి మాట్లాడలేక పోతున్నారు. తమ భుజాల మీద ఆయన స్వారీని మౌనంగా భరిస్తున్నారు.

---

## ఎస్పీ బదలీ

మొదటి పేజీ కొరవ

నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణతో ఒక దశలో ఆయన మీద చర్యకు కూడా సిద్ధపడింది ప్రభుత్వం. విచిత్రమేమంటే, తన తండ్రి గౌరవానికి తగినట్లుగా ప్రవర్తించలేదనే ఆరోపణ ఎదుర్కొన్న అధికారిని, అదే వైఎస్ కుమారుడు వైఎస్.జగన్ కోరి మరీ తమ జిల్లాకు ఎస్పీగా నియమించుకోవడం. ఆ రకంగా మల్లారెడ్డి అదృష్టవంతుడే.

కొత్త ఎస్పీ డామోదర్‌కు నెల్లూరు జిల్లాతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన స్వస్థలం కాళహస్తి. నెల్లూరులో కొంతకాలం బ్యాంక్ అధికారిగా పనిచేశాడు. గ్రూప్ వన్‌కు అర్హత సంపాదించిన తర్వాత నెల్లూరు ఎసిబి డిఎస్పీగా పని చేశారు. హైదరాబాద్‌లో విఐపి సెక్యూరిటీ విభాగంలో అపారమైన అనుభవం గడించినవాడు. సౌమ్యుడిగా, సంస్కారిగా, సత్ప్రవర్తన కల్గినవాడిగా మంచిపేరు వుంది. నెల్లూరులో ఆయన రాణింపుకు రావాలని కోరుకొంటున్నాము.

---

## జనవాణి

2వ పేజీ కొరవ

తీసుకోవడం లేదు. వారాంతపు సెలవు దినాలు, ప్రత్యేక పర్వదినాల్లో ఈ బీచ్‌కు వందల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. కాని ఇక్కడ మహిళలు సముద్ర స్నానం అనంతరం దుస్తులు మార్చుకోను గదులు లేవు. మంచినీటి పంపు, విద్యుత్ సౌకర్యం, రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల అప్పుడప్పుడు అపశృతులు దొర్లుతున్నాయి. పర్యాటకశాఖ కనీస సౌకర్యాలు ఏర్పాటుచేసి నామమాత్రపు ఫీజులు వసూలు చేసినా ప్రజలు సంతోషంగా చెల్లిస్తారు. ఈ విషయంలో కలెక్టరు గారు శ్రద్ధ తీసుకోమనవి.

సిహెచ్.సురేష్‌బాబు, నెల్లూరు.

### వైఎస్‌ను మరచిన ఇరిగేషన్ శాఖ!

జలయజ్ఞ రూపకర్త, అపరభగీరధుడు, ఆధునిక కాటన్ దొరగా పేరుతెచ్చుకొన్న నాయకుడు స్వర్గీయ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. ఆయనెంతో ముందుచూపుతో రాష్ట్రంలో ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇవన్నీ పూర్తయిన రోజు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలవారు కనీసం రెండు పంటలైనా పండిస్తారు. ఆహారధాన్యాల కొరత తీరుతుంది. రాజశేఖర్‌రెడ్డి మూలంగా ఎంతో గుర్తింపు తెచ్చుకొన్న ఇరిగేషన్‌శాఖ ఈ యేడాది ముద్రించిన వార్షిక క్యాలండర్‌లో ఆయన ఫోటో లేకుండా చేయడం దారుణం. ఆయన మరణించి ఆరు నెలలు కాకమునుపే ఇంతటి ద్రోహానికి ఓ ప్రభుత్వ శాఖ పూనుకోవడం భావ్యమా?

*బి.శాలి, కావలి*

### అనువదించండి!

జనవరి 29 'జమీన్‌రైతు' సంచికలో వచ్చిన జీవితకాలాన్ని చెప్పే జోతిష్యగ్రంథం 'లాంగ్‌విటీ అండ్ లైఫ్ స్పాన్' పుస్తకసమీక్ష బాగుంది. సమీక్షకుడు చక్కిరాల శ్రీనివాసులు విశ్లేషించిన అంశాలు చదువుతుంటే ఈ శాస్త్రం లోతుపాతులు తెలిసాయి. ఈ గ్రంథ రచయిత పి.ఎం.గోపాలాచారి జనం కోసం దీన్ని తెలుగులో అనువదించ మనవి.

*ప్రొఫెసర్ నాగరాజారావు, హైదరాబాద్*

---

## జిల్లా సమీక్షా కమిటీ

5వ పేజీ కొరవ

నికి చెందిన సభ్యులు ప్రతిపక్షసభ్యులకు ధీటుగా వ్యవహరించలేకపోయారు. సమావేశానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి హాజరైనా ప్రేక్షకుడిగా కొద్దిసేపు వుండి అనంతరం వెళ్లిపోగా, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరు కాలేదు. మిగిలిన ఇద్దరు అధికార ఎమ్మెల్యేల్లో ఒకరు మంత్రి రామనారాయణరెడ్డి వేదికపై ఆశీనులుకాగా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అజెండాలోని అంశాలపై పెద్దగా మాట్లాడలేకపోయారు. సమయాభావం కారణంగా అజెండాలోని అంశాలపై సుదీర్ఘచర్చ జరగలేదు. తిరుపతి పార్లమెంటు సభ్యులు చింతామోహన్ హాజరైనా మౌనంగా వుండిపోయారు. మొత్తం మీద జిల్లా సమీక్షా కమిటీ సమావేశం హడావుడిగా కొనసాగింది. ప్రతిపక్ష సభ్యులు అన్ని అంశాలపై ఆధిపత్యం సాధించగలిగారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాంగోపాల్, జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి, సుధీర్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ తాళ్లూరు రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

---

● బడ్జెట్ ఆమోదించకుంటే

# రాష్ట్రపతి పాలన తప్పదు!

శాసనసభ సమావేశాలు సక్రమంగా జరిపించలేకపోతే ప్రభుత్వం కూలిపోయి, రాష్ట్రపతి పాలన వస్తుందని సాక్షాత్తు ముఖ్యమంత్రి రోశయ్య బెదరింపులకు దిగడం మంత్రులను కలవర పెడుతున్నది. పదవి మీద నాకేమీ మోజు లేదు, వున్నా పోయినా నాకొకటే. పదవులను ప్రాణాలతో సమానంగా భావించే మీకే ఇబ్బంది. మర్యాదగా సభ సజావుగా జరగడానికి మీ శక్తినంతా ఉపయోగించి సహకరించండి. లేదంటే రాష్ట్రపతి పాలన పెట్టమని సిఫార్సు చేసి పారేస్తా... అని బెదరిస్తున్నాడు ముఖ్యమంత్రి. గత వారం రోజులుగా ఆయనది ఇదే దరువు.

శాసనసభలో బడ్జెట్ ఆమోదం పొందకుంటే రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం వస్తుంది. అయితే బడ్జెట్ ఆమోదానికి నిర్దిష్టమైన విధానం అంటూ ఏదీ లేదు. సభలో ప్రవేశపెట్టిన రోజే ఆమోదం అని ప్రకటించి, సభను వాయిదా వేసి వెళ్లినా ఇబ్బంది లేదు. సాంప్రదాయం ప్రకారం అయితే బడ్జెట్‌ను సమర్పించిన తర్వాత కనీసం నెల రోజుల పాటు దానిపై చర్చ జరపాలి. ఇటు తెలంగాణ, అటు సమైక్యాంధ్ర ఉద్యమాలతో రాష్ట్రం అట్టుడికి పోతున్న సమయంలో శాసనసభ సమావేశాలు సజావుగా జరుగుతాయన్న నమ్మకం ఎవరిలోనూ ఏ కోశానా లేదు. అందువల్ల ఏదో ఒకరకంగా బడ్జెట్ ఆమోద ముద్ర వేయిస్తే ప్రభుత్వం గండం నుంచి గట్టెక్కుతుందని రోశయ్య ఆలోచన. అందుకు మంత్రుల సహకారం కోరుతున్నారాయన. వారు మంచిగా చెప్తే మాట వినరు కాబట్టి, రాష్ట్రపతి పాలన భయంతో లొంగదీసుకోవాలని చూస్తున్నాడు.

అయితే మంత్రులు చెప్పినా ఎమ్మెల్యేలు వినే సూచన కన్పించడం లేదు. శ్రీకృష్ణ కమిషన్ విధివిధానాలు తెలంగాణకు అనుకూలం కాకుంటే అసెంబ్లీని జరగనివ్వమని తెగేసి చెప్తున్నారు టిఆర్ఎస్ నేతలు. వారు ఆ విధానం అవలంభిస్తే, వారిని అనుసరించి వెళ్లడం తప్ప వేరే గత్యంతరం లేదు కాంగ్రెస్, తెలుగుదేశం ఎమ్మెల్యేలకు. ఇప్పటికే తెలంగాణ గ్రామాలలో ఎమ్మెల్యేల రాజీనామాల మీద ప్రజలలో ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి. తమ పదవుల కోసం తెలంగాణ సమస్యను వెనక్కు నెట్టారన్న అభిప్రాయం ప్రజలలో కల్గితే ఈ ప్రాంతంలోని ఏ రాజకీయవాదికీ కూడా పుట్టగతులు వుండవన్నది నిజం. దానితో టిఆర్ఎస్‌ను లేదా దాని నియంత్రణలోని జెఎసిని కాదనే ధైర్యం ఏ పార్టీ ఎమ్మెల్యేకు కూడా లేదు.

---

## నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

ప్రభుత్వం హింద్‌రత్న అవార్డులు ఇస్తుంది. నెల్లూరీయుడు కొండ బిట్రగుంట వాసి కొర్సిపాటి శ్రీధర్ రెడ్డికి అమెరికా ప్రభుత్వం ఈ యేడాది ఈ అవార్డునిచ్చింది. జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొర్సిపాటి గోపాలరెడ్డి తనయుడే శ్రీధర్‌రెడ్డి. ఆయనకు మా అభినందనలు.

### శ్రీకృష్ణ దేవరాయ జయంతి సభ

నెల్లూరు వర్ధమాన సమాజం నేతృత్వంలో 21తేది టౌన్‌హాల్‌లో శ్రీకృష్ణ దేవరాయ జయంతి సభ జరుగుతుంది. ప్రసిద్ధ న్యాయవాది పి.వి. రమణారెడ్డి ఈ సభకు అధ్యక్షత వహిస్తారు. విజయవాడ సిద్దార్ధ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగళ్ల గురుప్రసాదరావు శ్రీకృష్ణదేవరాయలు - ఆముక్తమాల్యద అనే అంశంపై మాట్లాడి పూనూరుపోలారెడ్డి తన తండ్రి దివంగత పూనూరు ఆదిరెడ్డి స్మృత్యంకంగా చేసే సన్మానాన్ని స్వీకరిస్తారు.

### అధ్వాన్నపు పనులు గుర్తించిన కాకాణి!

జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి 9తేది నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద గల జూబ్లీ ఆసుపత్రిలో 19లక్షలు వెచ్చించి చేస్తున్న మురికినీటి పారుదల పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పనులను ఇంజనీర్లు లేకుండా కూలీలే చేయడాన్ని తప్పుపట్టారు. ఈ పనులను తక్షణం ఆపమని శ్యాంపిల్స్ తీసి క్వాలిటీ కంట్రోల్ విభాగానికి పంపారు. ఆసుపత్రి పనుల్లో నాణ్యత లోపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముస్లిం విద్యార్థుల ప్రదర్శన

హైకోర్టు ముస్లింల రిజర్వేషన్లు కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ముస్లిం మైనార్టీ విద్యార్థుల ఐక్యవేదిక నేతృత్వంలో 9తేది విద్యార్థులు నగరంలో ప్రదర్శన జరిపారు. ప్రదర్శనలో కార్పొరేటర్ జరీనాసుల్తానా, అబూబకర్, నన్నేసాహెబ్, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

## మరణాలు

నెల్లూరీయుడు ది హిందూ పత్రిక ఢిల్లీ లీగల్ కరస్పాండెంట్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన తలుపూరు పద్మనాభరావు సతీమణి రుక్మిణీదేవి (71) ఫిబ్రవరి 1తేది ఢిల్లీలో మరణించారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు.

***

అనుమసముద్రం పేట రాజవోలు గ్రామంలో పెద్ద రైతు, మైకా వ్యాపారిగానేగాక కాంట్రాక్టర్‌గా కూడా మంచి గుర్తింపు తెచ్చుకొన్న చిట్టమూరు వీరరాఘవరెడ్డి (83) 2తేది మరణించారు. ఇటీవల ఆయన గ్రామంలోని పోలేరమ్మ దేవస్థానం అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె.

***

వీరపల్లి వీణాపాణిగా అందరికీ సుపరిచితుడైన నవలా రచయిత, కావలి జవహర్‌భారతి తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఆంజనేయులు 7తేది నెల్లూరులో మరణించారు. ఆయన 100పైగా నవలలు, ఎన్నో కథలు, కవితలు, నాటికలు వ్రాశారు.

ఆత్మీయులను కోల్పోయిన పై మూడు కుటుంబాల వారికి మా సానుభూతి.

# నెల్లూరు సమ్మర్ స్టోరేజి ట్యాంకు పూర్తయ్యేదెప్పుడు?

**నెల్లూరు ప్రజల దాహార్తి తీర్చను చెరువులో నిర్మింప తలపెట్టిన సమ్మర్ స్టోరేజి ట్యాంకు పనులు వాస్తవానికి ఈ యేడాది జూన్‌కు పూర్తవ్వాలి. కానీ ఇక్కడ పని నత్తనడకన సాగుతుంది. వచ్చే యేడాదికి కూడా ఈ పనులు పూర్తయ్యే పరిస్థితి కనబడడం లేదు.**



నెల్లూరు చెరువులో స్టోరేజ్ ట్యాంకు కట్టపని కూడా పూర్తికాని దృశ్యం.

నెల్లూరు నగర ప్రజల దాహార్తిని తీర్చాలన్న సంకల్పంతో నెల్లూరు చెరువులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. 2008వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శంఖుస్థాపన కూడా చేయడం జరిగింది. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం తొలుత 105 కోట్ల రూపాయలను కేటాయించగా, సిమెంటు, స్టీల్ ధరలు పెరగడంతో మరో 15 కోట్ల రూపాయలు అదనంగా కేటాయించింది ప్రభుత్వం. నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా నేటికీ అరకొరగానే పనులు జరుగుతున్నాయి. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనుల కాంట్రాక్టును దక్కించుకున్న ఎల్‌అండ్‌టి కంపెనీ సబ్ కాంట్రాక్టర్లకు దీన్ని అప్పగించింది.

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం పనులపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేకశ్రద్ధ చూపకపోవడం వలన పనులు వేగవంతంగా జరగలేదు. ఇంతే కాకుండా సబ్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపి వేశారు. ఈ నిర్మాణ పనులు పర్యవేక్షించే ప్రజారోగ్య సాంకేతిక విభాగాల అధికారులు చాలా ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వున్నాయి. నిర్మాణ పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్లు రూరల్ ఎమ్మెల్యేకు కావలసిన వారు కావడం వలన అధికారులు నాణ్యతా ప్రమాణాల గురించి పట్టించుకోవడం మానేశారు. నగర ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న విషయం అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిసినా కూడా దీనిని పూర్తి చేసేందుకు కృషి చేయడం లేదు.

నెల్లూరు చెరువులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం కోసం 500ఎకరాలు కేటాయించి మట్టికట్టలు నిర్మించారు. ఈ నిర్మాణ పనులు తొలుత యుద్ధప్రాతిపదికన చేట్టాలని నిర్ణయించినా, ఆర్థిక మాంద్యం కారణంగా బిల్లులు చెల్లింపులో జాప్యం ఏర్పడుతూ రావడం వలన సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం ఎన్ని కోట్ల రూపాయలు విడుదల చేసింది? కాంట్రాక్టర్లకు ఎంత చెల్లింపులు జరిగాయి? పనులు ఏ మేరకు జరిగాయి? పనులు అసంపూర్తిగా మిగిలిపోవడానికి కారణాలు ఏమిటి? అన్న వివరాలు, సమాచారం సంబంధిత అధికారులు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు.

ట్యాంకు నిర్మాణం పూర్తయితే త్రాగునీటి సమస్య నుంచి గట్టెక్కుతామని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న నగర ప్రజలకు చివరకు నిరాశే మిగిలేటట్లు చేస్తున్నారు పాలకులు, అధికారులు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి తొలిసారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నెల్లూరు నగర ప్రజలకు తొలి కానుకగా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి అంగీకరించడంతోపాటు అవసరమైన నిధులను కేటాయించారు. అయితే జిల్లాస్థాయిలో పరిపాలన పూర్తిగా స్తంభించడంతో నిర్మాణ పనుల గురించి పట్టించుకునే దిక్కు లేకుండా పోయారు. సబ్ కాంట్రాక్టర్లు రూరల్ ఎమ్మెల్యేకు కావలసిన వారు కావడం వలన ఎమ్మెల్యే కూడా ఒత్తిడి తీసుకురావడం లేదు.

జిల్లా పరిషత్ సమావేశంలో గాని, మునిసిపల్ కార్పొరేషన్ సమావేశంలో గాని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనుల గురించి చర్చించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కృషిచేస్తే బాగుంటుంది.

# నెల్లూరు యాసకాదు 'కుల్లూరు' భాష!

ప్రతి ప్రాంతానికి ఒక్కో భాష వుంటుంది. భావ వ్యక్తీకరణకు భాష ఎంతో ముఖ్యం. భాషకు తగినట్లు ఆయా ప్రాంతాల ప్రజలకు ఒక్కో యాస సహజం. ఆంధ్రరాష్ట్రంలో వివిధ జిల్లాలలోని వారు వారి మాండలికంలో మాట్లాడుకోవడం తెలిసిందే. నెల్లూరుకు ఒక ప్రత్యేకమైన యాస వుంది. వీళ్ల నెల్లూరీయులు అని ఠక్కున గుర్తుపట్టేలా వున్నట్లే జిల్లాలోని కలువాయి మండలం కుల్లూరు గ్రామ ప్రజలు ఒక ప్రత్యేకమైన భాషను సొంతం చేసుకొని వున్నారు. కుల్లూరు భాషగా ప్రసిద్ధికెక్కిన దీని వెనుక ఎంతో చరిత్ర వుంది. చాన్నాళ్ల క్రితం ఈ కుల్లూరు గ్రామానికి చెందినవారు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో తిరుగుతూ విలువైన వజ్రాలు, పగడాల వ్యాపారం చేసేవారు. గిల్టు నగల వ్యాపారంలోనూ వీరికి మంచి నైపుణ్యత వుండేదట. బొంబాయి, కలకత్తా పట్టణాల నుంచి పగడాలు, ముత్యాలను కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్ అంతటా తిరుగుతూ వ్యాపారం చేసేవారు. గోదావరి జిల్లాల్లో వీరి వ్యాపారం బాగా సాగేది. తమ వ్యాపారమర్మాలు, ఆదాయ వ్యయాలు, ఇతర విషయాలు బయటవాళ్లకు అర్థం కాకుండా వుండేందుకు, తమకు మాత్రమే తెలిసేందుకు, అర్థమయ్యేందుకు లిపిలేని భాషను ఏర్పరచుకొన్నారు. అప్పట్లో ఈ గ్రామంలోని వ్యాపారులలో భాసిట్టి, అచ్చిత వెంకటస్వామి అనేవారు ప్రముఖులు. వీరు ఆభరణాలను చిలకలపూడి(బందరు)లోని ఆదెయ్య అనే కంసాలి వద్ద తయారు చేయిస్తుండేవారు. నగల తయారీని చమత్కారంగా బాణీలు కట్టి పాటలుగా వినిపించేవారు. వ్యాపారంలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు కుల్లూరు భాషలో మాట్లాడుకోవడంతో బయటివారికి ఇది అర్థమయ్యేది కాదు.

కాలక్రమేణా ఈ భాష మరుగున పడిపోయింది. ప్రస్తుతం ఈ గ్రామంలో భాష తెలిసినవాళ్లు అతి కొద్దిమందే వున్నారు. ఇప్పటికీ ఈ ఊరు వాళ్లు బయట నివసిస్తున్నా, గ్రామానికి చెందినవారు తారసపడినప్పుడు తమ కుల్లూరు భాషలోనే మాట్లాడుకొంటుంటారట. అప్పట్లో ప్రసిద్ధిగాంచిన ఈ భాష గురించి కుల్లూరు గ్రామస్తులు రాజారావు, రవీంద్రబాబు, మోహన్‌కృష్ణ 'జమీన్‌రైతు'కి వివరించారు. వాటిలో కొన్ని పదాలు ఇలా వున్నాయి.

| | | | |
|---|---|---|---|
| చిక్కప్ప - | పిల్లవాడు | పడిమివేలు- | ఎనిమిది |
| చిక్కు - | అమ్మాయి | పట్టు - | పది |
| ఏడమాయి- | పురుషుడు | మల్లపాటి కడిలె- | వంద |
| ఏడమ - | స్త్రీ | పెడము - | అన్నము |
| గవడుగాడు- | ముసలివాడు | పెడముపచ్చ- | విస్తరాకు |
| గవడ - | ముసలిది | ఎర్రగాజా - | మాంసము |
| పంజ - | ఇల్లు | మచ్చపాగలు- | చేపలు |
| జల్త్రము - | మంచము | ఆకాశజలాలు- | కల్లు |
| పచ్చ - | బంగారము | పాగజలాలు- | సారాయి |
| చెంబులు - | డబ్బులు | కొరిసిగాడు- | దొంగ |
| గీటు - | రూపాయి | వజ్రపాటివాళ్లు- | గొప్పవాళ్లు |
| అరగీటు - | అర్థరూపాయి | చిక్కుడుగాళ్లు- | పిల్లవాళ్లు |
| కదిలె - | పావలా | సుంకులు - | బియ్యం |
| యాకు - | ఒకటి | పొట్టసుంకులు- | వడ్లు |
| యసొక్క - | రెండు | కీలకట్ట - | కోడి |
| శూలము - | మూడు | నడవ - | పంది |
| చౌకము - | నాలుగు | కొరుసు - | తప్పు |
| పోటు - | ఐదు | తగడుపెట్టెలు- | అబద్ధాలు చెప్పేవాడు |
| చిటికెన వేలు- | ఆరు | సారుగు - | పొగాకు |
| ఉంగరపు వేలు- | ఏడు | | |

Regn.No. : RN 1156 / 57
J/Nellore/008/09-11

# ఉత్తరక్రియలు



మూర్తీభవించిన మానవత్వం, పరిమళించిన ప్రేమామృతమూర్తిత్వంతో
మా జీవితాలలో వెలుగులు నింపిన తేజోమూర్తి,
మా మనోమందిరాలలో దివ్యదీప్తి

## శ్రీ చిట్టమూరు వీరరాఘవరెడ్డిగారు

తేది 02-02-2010 మంగళవారం సాయంత్రం 4-15 గంటలకు
మమ్ములను వీడి దైవసాన్నిధ్యం చేరారు. వారి ఆత్మకు శాంతిని ప్రసాదించమని
భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : చిట్టమూరు సీతారామమ్మ

**కుమారులు - కోడళ్ళు**

స్వర్గీయ చిట్టమూరు విజయకుమార్‌రెడ్డి - వసంతకుమారి
(చీఫ్ ఇంజనీరు, టిజిపి ప్రాజెక్టు)
చిట్టమూరు వెంకటకృష్ణారెడ్డి - కవిత
చిట్టమూరు వాసుదేవరెడ్డి - మహతి

**మనుమలు - మనుమరాళ్ళు**

---
చల్లా శరత్‌చంద్రారెడ్డి - నీలోఫర్
చిట్టమూరు మహర్షిరెడ్డి

**కుమార్తె - అల్లుడు**

బొమ్మిరెడ్డి విద్యావతి - స్వర్గీయ సీతారామిరెడ్డి

బొమ్మిరెడ్డి హర్షవర్ధన్
బొమ్మిరెడ్డి దిలీప్ - శ్రీలక్ష్మి

**అన్నలు - వదినలు**

స్వర్గీయ చిట్టమూరు రామిరెడ్డి - స్వర్గీయ శకుంతలమ్మ
స్వర్గీయ చిట్టమూరు చిన్నపరెడ్డి - శ్రీదేవమ్మ

**తమ్ముళ్ళు - మరదళ్ళు**

చిట్టమూరు వెంకటశేషారెడ్డి - కృష్ణవేణమ్మ
చిట్టమూరు హరిశ్చంద్రారెడ్డి - సులోచనమ్మ
చిట్టమూరు గోపాలకృష్ణారెడ్డి - వజ్రావతమ్మ

**బావలు - సోదరీమణులు :**
స్వర్గీయ ముంగమూరు వెంకురెడ్డి - స్వర్గీయ రామమ్మ
స్వర్గీయ ముంగమూరు నరసారెడ్డి - స్వర్గీయ వనమ్మ
స్వర్గీయ నూకలపాటి రామిరెడ్డి - అనసూయమ్మ

## శ్రీ చిట్టమూరు వీరరాఘవరెడ్డి

రాజవోలు గ్రామం, ఎ.ఎస్.పేట మండలం

జననం : 25-09-1927 మరణం : 02-02-2010

**నిలుపు :** తేది 17-02-2010 బుధవారం సా॥ 6గంటలకు
**పెద్దకర్మ :** తేది 18-02-2010 గురువారం
నెల్లూరు జిల్లా, ఎ.ఎస్.పేట మండలం, రాజవోలు గ్రామంలోని మాస్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

చిట్టమూరు మరియు ముంగమూరు వారి కుటుంబసభ్యులు రాజవోలు గ్రామం, ఎ.ఎస్.పేట మండలం, నెల్లూరు జిల్లా.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.